## అత్యంత ధైర్యశాలి

# లాల్ బహదూర్ శాస్త్రి

(జీవిత విశేషాలు - బొమ్మలతో సహా)



సోమనాథ్ పబ్లిషర్స్

# లాల్ బహదూర్ శాస్త్రి

## జననము

"జై జవాన్", "జైకిసాన్" అనే నినాదము ప్రజలను ఉత్తేజపరచిన స్వాతంత్ర్య సమరయోధుడు, సత్యవ్రతుడు, నిరాడంబరుడు, నిర్భయశీలుడు, కర్మయోగి ఎవరు?

ఆయనే భారతమాత ముద్దుబిడ్డ ''లాల్‌బహదూర్ శాస్త్రి". సాధారణంగా శర్మ, శాస్త్రి, చైనులు, సోమయాజులు మొదలగు పేర్లు బ్రాహ్మణుల పేర్లకు కనిపిస్తాయి. కాని ఆయన కాయస్థ కుటుంబానికి చెందినవాడు. కాయస్థులంటే సంఘంలో గౌరవ మర్యాదలతో జీవించేవారన్నమాట. ఎందుచేతనంటే వారు మొగలాయి చక్రవర్తుల కాలంనుంచి మంచి ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారు.

లాల్ బహదూర్ శాస్త్రి గారి తల్లిపేరు "రామ దులారీదేవి". ఆయన తండ్రిపేరు "శారదా ప్రసాద్" శాస్త్రిగారు "మొగల్ సరాయ్" లో 1904 లో జన్మించారు. కాని స్వగ్రామం వారణాసి దగ్గర గంగానదికి అవతలి ఒడ్డున ఉన్న రామ్‌నగర్. శారదా ప్రసాద్ ఒకస్కూల్ టీచర్‌గా కొంతకాలం పని తర్వాత రెవెన్యూ డిపార్టుమెంటులో గుమస్తాగా కొంతకాలం పనిచేశారు.



రైతు దంపతులు గంపలో దొరికిన బాబుని చూసి ఆనందించారు



రామదులారీదేవి తన కొడుకుకి మూడునెలల వయసున్నప్పుడు ప్రయాగకు కుంభమేళాకు అతన్ని చంకనపెట్టుకొని వెళ్ళింది. గంగానదిని దాటే సమయంలో ఆమె చంకలో బిడ్డ జారిపోయాడు. ఆమె విషణ్ణవదనంతో దుఃఖిస్తూ ఎంత వెదికినా దొరకలేదు. గంగానదికి ఆహుతి అయిపోయాడని దుఃఖముతో ఇంటికి వెళ్ళిపోయింది. ఆ బిడ్డ నదిలో పడిపోలేదు. ప్రక్కనే ఉన్న ఇంకొక పడవలో ఉన్న ఒకరైతుయొక్క గంపలో పడిపోయాడు. ఆ రైతు ఇంటికి వెళ్ళిన తర్వాత చూసుకుంటే గంపలో పండంటి బాబును చూసి, భగవంతుడిచ్చిన బిడ్డగదా అని అల్లారు ముద్దుగా పెంచుకొనసాగారు. కాని రామదులారీకి ఏదో గాలివార్త అందింది. అప్పుడు ఆ చుట్టు ప్రక్కల ఊళ్ళన్నీ వెదకి చివరికి ఆ రైతుదగ్గర తనకొడుకును చూసి ఇమ్మని అడిగితే తను పెంచుకొంటున్నాని ఇవ్వనని చెప్పెను. అప్పుడామె పోలీసుల సహాయంతో తన కొడుకును తెచ్చుకొన్నది. వారి కుటుంబం సాఫీగా సాగిపోతున్నది.

## బాల్యం

లాల్ బహదూర్ శాస్త్రి గారికి 18 నెలలు వయస్సు ఉండగా తండ్రి శారదాప్రసాద్‌గారు పరలోక గతుడయ్యారు. అప్పుడు రామదులారీదేవిత కొడుకుని, ఇంకొక ఇద్దరు కూతుళ్ళను వెంట బెట్టుకొని తండ్రిగారి ఇంటికి మొగల్‌సరాయ్ వెళ్ళిపోయింది.

ఆమె తండ్రిపేరు హజారిలాల్. ఆయనకు రామదులారీదేవి పెద్దకూతురు. ఇరవయ్యేళ్ళయినా నిండకుండానే కూతురుకు వైధవ్యం ప్రాప్తించినందుకు ఆయన ఎంతో బాధపడి ఆ కుటుంబాన్ని తన

యింటిలోనే ఉంచుకొని ప్రత్యేకశ్రద్ధతో పోషిస్తున్నాడు. ఆయన ఒక స్కూల్ టీచర్. లాల్‌బహదూర్‌ని అల్లారుముద్దుగా చూస్తూ పెంచిపెద్దచేసి విద్యాబుద్ధులు నేర్పిస్తూ వచ్చాడు. అతడే కాకుండా ఆ యింట్లో ఉన్న పెద్ద కుటుంబసభ్యులంతా కూడ ఆ బాలుణ్ణి అతిగారాబంగా చూసేవారు. సాధారణంగా గారాబం చేస్తే పిల్లలు పెంకివాళ్ళుగా తయారవుతారు. కాని ఆ పిల్లవాడికి అల్లరి ఏమీ అబ్బలేదు సరికదా వినయవిధేయతలు, పెద్దలపట్ల గౌరవం, చదువుపట్ల శ్రద్ధ, ఆత్మగౌరవంతో జీవించడం సహజంగానే అలవాటయ్యింది. పువ్వుపుట్టగానే పరిమళిస్తుంది. అంటే ఇదే.

## విద్యాభ్యాసం

ఆ ఊరి ఎలిమెంటరీ పాఠశాలలోనే లాల్‌బహదూర్‌ని చేర్పించారు. అతడు గురువుల పట్ల భక్తితో విద్యనభ్యసించేవాడు. అన్ని తరగతులలోను మంచి మార్కులతో ప్యాసవ్వడమేకాకుండా తోటిపిల్లలకు ఆదర్శప్రాయంగా చేదోడువాదోడుగా ఉండుటతో పెద్దవారి ఆదరాభిమానాలను కూడ పొందగలిగేవాడు.

అతడు చదువుకొనే రోజుల్లో ఒక జతబట్టలు మాత్రమే ఉండేవి. ఒక పంచి, ఒకచొక్కా అవే ప్రతిరోజూ ఉతుక్కొని ధరించేవాడు. అయినా తనపేదరికానికి అతడెప్పుడూ చింతించలేదు. తాతగారింట్లో ఎక్కువ మంది పిల్లలు ఉండుటచే అందరితో ఆడుతూ పాడుతూ ఎంతో ఆనందంగా ఉండేవాడు.

ఆరవ తరగతి ప్యాసయిన తర్వాత అక్కడి చదువు పూర్తై వారణాసి పైచదువు కొఱకు వెళ్ళవలసి వచ్చింది.





## వారణాసిలో హైస్కూలు జీవితం

వారణాసిలో హరిశ్చంద్ర హైస్కూలులో ఏడవ తరగతిలో ప్రవేశించాడు. అప్పటికి అతని వయస్సు పదకొండు సంవత్సరాలు. అక్కడ తన మేనమామగారైన రఘునాథ్ ప్రసాద్ గారింట్లో ఉండేవాడు. ఆయన మున్సిపల్ ఆఫీసులో హెడ్‌క్లర్కుగా ఉద్యోగం చేసేవాడు. అతని ఉద్యోగం, జీతం మంచిగానే ఉన్నా, కుటుంబం పెద్దది కావడంతో ఆదాయానికి మించకుండా ఖర్చులను జాగ్రత్తగా చేసుకునేవాడు.

వారణాసి భక్తులకు, శిష్టాచారులకు, యోగులకు, యజ్ఞయాగాది క్రతువులకు నిలయం కాబట్టి అక్కడ ఎక్కువగా పవిత్రతచోటు చేసుకుంది. రఘునాథ్ ప్రసాద్ స్వతహాగా సౌమ్యుడు, సనాతనా చారసంపన్నుడు అందుచేత అక్కడి పవిత్రత ఆయన మీద బాగా పనిచేసింది. లేనిదానికోసం ఆశించకుండా ఉన్నదానితో సరిపెట్టుకొంటూ నిష్కామ కర్మతో నిష్ఠాగరిష్ఠుడై జీవితం సుఖశాంతులతో గడుపసాగాడు. ఆయన నడవడి ప్రభావం లాల్‌బహదూర్‌మీద చక్కగా ముద్రవేసింది. స్థిత ప్రజ్ఞత్వం అంటే కష్టాలను సుఖాలను సమానరీతిలో సహనంతో అనుభవించడం, సత్యసంధత, త్యాగనిరతి లాల్‌బహదూర్ మేనమామ దగ్గర నేర్చుకున్నాడు.

అతనికి స్కూల్లో అతని జీవితనావకు చుక్కానిలా పనిచేసిన మరో మహావ్యక్తి "నిష్కామేశ్వరమిశ్రా" అనే ఉపాధ్యాయుడు ఆయన లెక్కలు, ఇంగ్లీషు బోధించేవాడు. ఆయన ఒక విజ్ఞాన భాండాగారము. ఆయన

సర్వ విషయాల పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకున్న మహామేధావి. ఆయన విద్యార్థుల మనో వికాసానికి పనికివచ్చే విషయాలను ప్రబోధిస్తూ వారిని చైతన్యవంతులను చేసేవాడు. చరిత్రగురించి చెబుతూ రాణాప్రతాప్, శివాజీ, ఝాన్సీబాయి వంటి వీరుల గాథలను కథలు కథలుగా చెప్పి వారిహృదయాలలో పాతుకొనేలా చేసేవాడు. ఆయన స్కౌట్ టీచరు అందుచేత తరుచుగా విద్యార్థులను క్యాంపులకు తీసుకువెళ్ళి అక్కడ వారికి లోకజ్ఞానంతోపాటు దేశ స్వాతంత్ర్యంకొఱకు కృషి చేసి జీవితాలర్పించిన లాలలజపతిరాయ్, బాలగంగాధర తిలక్ వంటి మహాయోధుల చరిత్రలను కూడ విశదీకరించి చెప్పేవాడు. "'స్వాతంత్ర్యం నా జన్మహక్కు, అని ఎలుగెత్తి, చాటిన లోకమాన్య బాలగంగాధర తిలక్ గారికి జోహారులర్పిస్తూ, దేశ స్వాతంత్ర్యం కొఱకు అందరూ పాటు పడాలని దేశభక్తిని వారికి వెన్నతో పెట్టిన విద్యలా నేర్పేవాడు.

లాల్ బహదూర్ కు హరిశ్చంద్ర హైస్కూల్లో చదివేటప్పుడు ఇంగ్లీషు బాగా వచ్చేది. లెక్కల్లో కొంచెం తక్కువ మార్కులు వచ్చేవి. కాని ఆల్‌జీబ్రా, జామెట్రీలో నూటికి నూరు మార్కులు వచ్చేవి. ఆయన సుగుణాలను, విద్యాధిక్యతను చూసి అతన్ని ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధతో చూచి అతని భవిష్యత్తును బంగారు బాటగా తీర్చిదిద్దారు.

## స్వాతంత్ర్య ప్రభంజనం

భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వ నిరంకుశ పరిపాలనకు, బానిస బ్రతుకునకు విసుగెత్తిన ప్రజలు స్వారాజ్యకాంక్షతో పురోగమించ సాగారు.



లాల్ బహదూర్ శాస్త్రి

రాజకీయ నాయకులు కూడ వారి ప్రచారాన్ని ద్విగుణీకృతం చేయసాగారు. ప్రజలు వారి ఉపన్యాసాలకు ఎగబడుతున్న రోజులవి.

లాల్ బహదూర్ కి "స్వరాజ్యం నా జన్మహక్కు" అని వైతాళికుని లా పలికిన బాలగంగాధర్ తిలక్ మీద, మోహన్‌లాల్ కరంచంద్ గాంధీగారి మీద ఎనలేని గౌరవాభిమానాలు మనస్సులో గాఢంగా నాటుకొన్నాయి.

ఒకసారి తిలక్ వారణాసిలో ప్రసంగిస్తారని తెలిసి లాల్ బహదూర్ అప్పటికి 50 మైళ్ళ దూరంలో ఉన్నవాడు, రైలు ఖర్చుకు దగ్గర డబ్బులు లేకపోతే విధిలేని పరిస్థితిలో అప్పుచేసి మరీవెళ్ళాడు. తిలక్ ఉపన్యాసంలో 'భారతమాత దాస్య శృంఖలాలను ఛేదించి స్వాతంత్ర్యం సంపాదించవలసిన ఆవశ్యకతను గురించి ఉత్తేజకరంగా ప్రబోధించాడు. ఆసక్తితో లాల్‌బహదూర్ ఉద్రేకంతో నఖశిఖ పర్యంతం ప్రభావితు డయ్యాడు.

## గాంధీగారి ప్రధమ సందర్శనం

లాల్‌బహదూర్‌కి 12 ఏళ్ళ వయసున్నప్పుడు గాంధీగారు 1916లో పండిత మదనమోహన్‌మాలవ్యా పంపిన ఆహ్వానంతో బెనారస్ విశ్వవిద్యాలయ ప్రారంభోత్సవ సందర్భంగా వారణాసికి వచ్చారు. భవనాలకు శంకుస్థాపన నిమిత్తం లార్డు హార్డింగ్ కూడ ఆహ్వానించబడ్డాడు. మహారాజులు కూడ మంచి దుస్తులు, ఆభరణాలు ధరించి వచ్చారు. దర్భాంగా మహారాజు అధ్యక్షత వహించిన సమావేశంలో గాంధీగారు ఉపన్యసించారు. లాల్‌బహదూర్ గాంధీగారిని చూడడం అదే మొదటిసారి. ఆయన ముతక బట్టలతో, తలపాగాతో ఒక రైతులా కనిపించాడు.

ఆ నిరాడంబర మహావ్యక్తి (బార్.ఎట్‌లా) ప్రజలను ఉత్తేజపరుస్తూ భారతదేశ దాస్యవిముక్తికి, స్వాతంత్ర్య సముపార్జనకు అందరు అంకిత భావంతో కృషి చెయ్యాలన్నారు. సహాయ నిరాకరణోద్యమం చేపట్టాలన్నారు. విదేశ వస్తు బహిష్కరణ, ఖద్దరు ధారణ, మద్యపాన నిషేధం, హిందూ ముస్లిం ఐక్యత గురించి నొక్కి వక్కాణించారు. పరదేశీయుల ప్రభుత్వ ఉద్యోగాలు, స్కూల్సు బహిష్కరించాలన్నారు. దేశ స్వాతంత్ర్యం కొఅకు తను "సత్యాగ్రహం" అనే అహింసా మార్గాన్ని అవలంబిస్తానన్నారు. అందుకు అందరూ సన్నద్ధం కావాలన్నారు. వచ్చిన మహారాజులను వారి విలువైన ఆభరణాలను అమ్మివేసి ఆ సొమ్ముతో తమ ఉద్యమానికి తోడ్పడమన్నారు. దానికి వారికి కోపం వచ్చి సభనుండి వెళ్ళిపోయారు. అధ్యక్షుడు కూడ వెళ్ళిపోయాడు. అనిబిసెంట్ కూడ గాంధీగారి నిర్మొహమాటపు ఉపన్యాసానికి నొచ్చుకున్నారు. అయినా ప్రజలు ఆ ఉపన్యాసం విని ఉప్పొంగిపోయారు. అందులో లాల్‌బహదూర్ మరీ చైతన్య వంతుడయ్యాడు. అప్పటికే అతడు జాతీయబాలల స్కౌట్ దళంలో శిక్షణపొందాడు. గాంధీగారి నిరాడంబరమైన రైతులాంటి ఆకారం లాల్‌బహదూర్ మనోఫలకంపై చెరగని ముద్రలా నిలిచిపోయింది.

లాల్‌బహదూర్ కాశీనగరంలో గాంధీగారి ఉపన్యాసం విన్న తరువాత జాతీయ నాయకులైన బాల గంగాధరతిలక్, గోపాలకృష్ణ గోఖలే, మహాత్మాగాంధీ, బిపిన్‌చంద్రపాల్, లాలాలజపతిరాయ్, సురేంద్రనాథ్ బెనర్జీ మొదలగు వారి ఉపన్యాసాలను లైబ్రరీలలోను, పత్రికలలోను శ్రద్ధగా చదవడం మొదలు పెట్టాడు. వాటి ప్రభావం వలన అతని మనస్సులో దేశభక్తి జాతీయ భావాలు దినదిన ప్రవర్ధమాన మవుతున్నాయి.





గాంధీగారు అంతకుముందే దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కుల కోసం అహింసా వ్రతాన్ని చేపట్టి విజయం సాధించిన తర్వాత భారతదేశానికి వచ్చారు. ఇక్కడ ఇండియాలో బ్రిటిష్ వారి నిరంకుశ పరిపాలనను తుదముట్టించాలని దీక్షాకంకణ ధారియై దేశం నలుమూలలా పర్యటించి ప్రజలను దేశభక్తి పరులుగాను, మాతృదేశ దాస్య విముక్తికి నడుంబిగించి సన్నద్ధులు కావలసిందిగాను ఉత్సాహ ప్రోత్సాహాలను కలిగిస్తున్నారు. అప్పటికే "స్వాతంత్ర్యం నా జన్మ హక్కు" అని ఎలుగెత్తి చాటిన లోకమాన్య బాలగంగాధర తిలక్ పూరించిన శంఖారావం ప్రజల హృదయ కుహరాల్లో మారుమ్రోగుతున్నది. దానికి తోడు గాంధీగారి ఉత్తేజకర ఉపన్యాసాలు, అహింసా వ్రతదీక్ష, సహాయ నిరాకరణోద్యమం మొదలగు స్వరాజ్యప్రేరకాలు ప్రజలను కార్యోన్ముఖులను గావిస్తున్నాయి.

## బానిస విద్య బహిష్కరణ

లాల్ బహదూర్‌కి గాంధీగారి ప్రబోధాత్మక సందేశం మనస్సులో పదే పదే గుణమర్దన చేయసాగింది. దానితో పరదేశ పరిపాలకుల పాఠశాలను బహిష్కరించాలనే భావన తీవ్ర సంక్షోభాన్ని కలిగించింది. ఒక ప్రక్కన జాతీయోద్యమంలో చేరి స్వాతంత్ర్య సముపార్జనకొఅకు దేశానికి సేవ చెయ్యాలనే గాఢమైన కోరిక, రెండవ ప్రక్కన కుటుంబ పరిస్థితి, తల్లిని ఆదుకోవాలనే తపన. ఇంటిలోని వారుకూడా ఇంకోమూడు నెలలు ఓపిక పట్టితే చదువు ఓ కొలిక్కివస్తుంది,అప్పుడు ఏదో

ఒకఉద్యోగం చేసి కుటుంబాన్ని ఆదుకోవచ్చని హితవచనాలు. అయినా అతని మనస్సు జాతీయ భావాలవైపే మొగ్గింది.

లాల్‌బహదూర్, త్రిభువన నారాయణ సింహ (టి.ఎన్.సింగ్), అలగూర్‌రాయ్ ముగ్గురు 1921 వ సంవత్సరంలో ఒక రోజున సత్యాగ్రహులదళం హరిశ్చంద్ర స్కూల్ ముందు నుంచి సాగిపోతుంటే ఆ సహాయ నిరాకరణోద్యమంలో కలసిపోయారు.

సహాయ నిరాకరణోద్యమంలో చేరిన లాల్ బహదూర్ శాస్త్రికి 16 సంవత్సరాల వయస్సు పోలీసులు ఆయన్ను అరెష్టుచేసి, అతని వయస్సు తక్కువగా ఉన్నందున అతన్ని విడిచిపెట్టేరు. అప్పుడేమి చెయ్యాలో తోచక తత్త్వవేత్త డాక్టర్ భగవాన్‌దాస్ దగ్గరకు వెళ్ళి సలహా అడిగితే, ఆయన కాశీవిద్యాపీఠ్‌లో చేరి చదువు కొనసాగించమని హితవు చెప్పారు.

త్రిభువన్ నారాయణ సింహ, అలగూయ్‌లతో కలసి లాల్-బహదూర్ కాశీ విద్యాపీఠ్‌లో చేరి జాతీయభావాలతో స్వదేశీయులచే నడపబడుచున్న విద్యాలయంలో ఉత్సాహంతో చదవడం ప్రారంభించారు.

కాశీ విద్యాపీఠ్‌లో ప్రిన్సిపాల్ డా॥భగవాన్‌దాస్‌గారు జాతీయ భావాలతో ఆదర్శప్రాయంగా ఇన్‌స్టిట్యూట్‌ని నడిపేవారు. లాల్‌బహదూర్ అక్కడ చదువుచున్నప్పుడు ఎంతో చురుకుగా, ఉల్లాసంగా ఉండేవారు. ఆయన ముఖముపైన ఎల్లప్పుడూ చిరునవ్వు చిందులాడుతూ ఉండేది.





అక్కడ 70 లేక 80 మంది కంటే ఎక్కువ విద్యార్థులుండేవారు కారు. చెట్ల క్రింద చదువు.

సహాయ నిరాకరణోద్యమ సమయంలో బ్రిటిష్ వారి ఆధ్వర్యంలో ఉండే బెనారస్ విశ్వవిద్యాలయం నుండి రిజైన్ చేసి వచ్చిన ఆచార్య నరేంద్రదేవ్, డాక్టర్ సంపూర్ణానంద్, ఆచార్య జె.బి. కృపలాని, శ్రీప్రకాశ వంటి లెక్చరర్సు కాశీ విద్యాపీఠ్‌లో చేరారు. వారి సేవలు విద్యార్థులను దేశభక్తులుగా, విజ్ఞానవంతులుగా చేసే కృషిలో నిస్వార్థంగా, అంకిత భావంతో నిరుపమానంగా ఉండేవి. దానితో విద్యార్థులు కూడ ప్రతిభాపాటవాలతో విజ్ఞాననిధుల్లా తయారయ్యేవారు.

గాంధిగారి అభ్యర్థన మేరకు శివప్రసాద్ గుప్తా అనే ధనవంతుడు కాశీ విద్యాపీఠ్‌కు పది లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ విద్యాలయంలో చదువుకొనే విద్యార్థులే వంతులు వారీగా స్వంతంగా వంట చేసుకొని సాధారణ భోజనంతో సంతృప్తి పడేవారు. లాల్‌బహదూర్‌కి వంటచెయ్యడం చాల సరదాగా ఉండేది. అంతే కాదు ఎంతో ఉత్సాహంతో సభలు, సమావేశాలు జరుపుతూ, ఉపన్యాసాలిస్తూ తోటి విద్యార్థులను ఉత్తేజపరిచేవారు. ఆయన మనిషి పొట్టివాడైనా చదువులోను, తెలివితేటల్లోను మహాదిట్ట. రాజారామ్, ఆయన మంచి స్నేహితులు. ఆయన ఎంత పొట్టివారో రాజారామ్, ఆయన మంచి స్నేహితులు. ఆయన ఎంత పొట్టివారో, రాజారామ్ అంత పొడగరి. వారి ప్రతిభను చూచి ప్రిన్సిపాల్ వారిద్దరిని ఎంతగానో అభిమానించే వారు.

విద్యాపీఠ్‌లో లాల్‌బహదూర్ దర్శనశాస్త్రం, సంస్కృతం ప్రత్యేకమైన సబ్జక్టుగా నేర్చుకొనేవారు. డా॥భగవాన్ దాస్ దర్శనశాస్త్రం బోధించడానికి వారిక్లాస్‌కి ప్రతిరోజూ వెళ్ళేవారు. అందుచేత ఆక్లాస్ విద్యార్థులను కూడ మిగతావారు అభిమానించి గౌరవించేవారు.

లాల్‌బహదూర్ హైస్కూల్లో చదువుచున్న రోజుల్లో ఉర్దూభాష రాజభాషగా చెలామణీలో ఉండడంచేత ఆ భాష ఆయనకు బాగా వంటబట్టింది. కళాశాల చదువులో మొదట సంస్కృతం నేర్చుకోవడం కష్టంగా అనిపించింది. అతని స్నేహితుడు అలగూ రాయ్ కొంతకాలం లాల్‌బహదూర్‌కి సంస్కృతం నేర్చుకోవడంలో సహాయ పడ్డాడు. ఆ తర్వాత ఆయనకు సంస్కృతం అధ్యయనం చెయ్యడం నల్లేరుపై బండి సాగింది. విద్యాపీఠ్‌లో ఉన్నత భావాలు కలిగిన ఆదర్శ ప్రాయులైన ఉపాధ్యాయుల శిక్షణతోపాటు మేధావులైన సహాధ్యాయులు కూడా అండదండలుగా లాల్‌బహుదూర్‌కు ఉండేవారు. రాజారామ్‌శాస్త్రి, అలగూరాయ్, త్రిభువన నారాయణసింహ, బాలకృష్ణకేస్కర్, లాల్‌బహదూర్‌కి ముఖ్యమైన మిత్రులు.

## శాస్త్రి డిగ్రీ సంపాదన

కాలేజీలో చదువుకొనే పుస్తకాలతోపాటు లైబ్రరీలో గ్రంథాలు, పత్రికలు, గాంధీగారి ఋజువర్తనానికి స్ఫూర్తినిచ్చిన లియోటాల్‌స్టాయి రచించిన పుస్తకాలను చదవడం, రామకృష్ణ పరమహంస, వివేకానంద సిద్ధాంతాలను అర్థంచేసుకోవడం వంటి నిర్విరామ కృషి ఆయన మనస్సును పదును పెట్టాయి.





లెనిన్ గ్రంథాలలోని సాంఘిక, రాజకీయ నైతిక, సమస్యలను పరిష్కరించిన విషయ పరిజ్ఞానాన్ని బాగా అధ్యయనం చేశారు. వీటన్నిటి పర్యవసానంగా లాల్‌బహదూర్ "శాస్త్రి" అనే డిగ్రీలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. బి.ఏ.డిగ్రీతో సమానమైన "శాస్త్రి" డిగ్రీని కాశీ విద్యాపీఠ్‌లో 4 సంవత్సరాలు చదివి సాధించారు. ఆయన పేరు చివర ఉన్న "శాస్త్రి" అనేది ఆయనకు విద్య రీత్యా వచ్చిన డిగ్రీ కాని బ్రాహ్మణులపేరు చివర పెట్టుకునే శాస్త్రి, శర్మ, చైనులు వంటిది కాదు. ఆయన బ్రాహ్మణుడు కాదు, ఆయన కాయస్థ కులానికి చెందినవారు.

## హరిజనోద్ధరణ


"శాస్త్రి" పరీక్ష ప్యాసయిన తర్వాత లాల్‌బహదూర్ పేరు లాల్‌బహదూర్ శాస్త్రిగా స్థిరపడిపోయింది. కాంగ్రెస్ పార్టీ అతివాద, మితవాద పార్టీలుగా చీలిపోయింది. అది శాస్త్రిగారికి నచ్చకపోయినా గాంధీగారి నాయకత్వంలో నున్న అతివాద పార్టీవైపే మొగ్గుచూపారు. పంజాబ్ కేసరి లాలాలజపతిరాయ్ స్థాపించిన "సర్వెంట్స్ ఆఫ్ దిపీపుల్ సొసైటీలో 1925 లో అలగూరాయ్, లాల్‌బహదూర్ శాస్త్రి జీవిత సభ్యులుగా చేరడంతో వారికి నెలకు 75 రూపాయల జీతం కూడ లభించేది. సొసైటీ శాస్త్రిగారిని మీరట్ పంపించి, అక్కడ కుమార్ ఆశ్రమంలో ఉంటూ హరిజనోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టవలసిందిగా ఆదేశించింది. అక్కడ హిందువులు హరిజనులను అంటరానివారిగా చూస్తూ వారిని దూరంగా ఉంచుతూ, వారి పిల్లలను తమ పాఠశాలల్లో ప్రవేశించరాదని ఆంక్షలు విధించేవారు. లాల్‌బహదూర్ శాస్త్రిగారికి డా॥భగవాన్ దాస్ గారి దగ్గర శిష్యరికము బాగా వంట బట్టడం చేతను,

గాంధీగారి సిద్ధాంతాలు ఔపాసన పట్టడం చేతను నేర్పు, ఓర్పు బాగా అలవడింది. దానితో మీరట్‌లో ప్రజలను జాతీయాభావాలలో, సంఘ సంస్కరణలోను చైతన్యవంతులను గావించి వారి ఆంక్షలను తొలగింపజేసి సంఘజీవితాన్ని ఉద్ధరించి, హరిజనుల బాలబాలికలను హిందువుల పాఠశాలల్లో చేర్చుకొనేటట్లు చేసి అందరికి ఆనందం కలిగేలా మంచి మార్పును తీసికొని రాగలిగారు. అంతేకాదు ప్రజాసేవకు అకుంఠిత దీక్షతో కృషి చేస్తూ, పెద్ద పెద్దవారితో పరిచయం చేసుకుంటూ, ప్రజల సమస్యలకు చక్కటి పరిష్కారాన్ని అందిస్తూ అందరి ఆదరాభిమానాన్ని చూరగొంటూ ప్రజాబంధువుగా నిరాడంబరత్వంతో, సౌశీల్యత్వంతో జీవితాన్ని పునీతం చేసుకొంటూ సత్యసంధత, ధర్మాచరణ అలవరచుకొని మానవత్వం మూర్తీభవించిన కర్మయోగిలా తయారై కాంగ్రెస్ కార్యకర్తలలో మంచిపేరు ప్రఖ్యాతులు గడించారు. కాశీవిద్యాపీఠ్‌లో చదువు ఆయనకు ఎంతగానో మార్గదర్శకమయ్యింది. సర్వెంట్స్ ఆఫ్ దిపీపుల్సు సొసైటీయే తనను ప్రజల మధ్యకు వెళ్ళి వారి సేవచేయడానికి ప్రప్రథమంగా దోహదకారి అయిందని శాస్త్రిగారు పదే పదే అంటూ ఉండేవారు.

## శాస్త్రిగారి వివాహం

శాస్త్రిగారిని పెద్దలు 1927 వ సంవత్సరంలో పెండ్లి చూపులకని మీర్జాపూర్ తీసికొని వెళ్ళినారు. అక్కడ అన్న, వదినల దగ్గర అణకువతో సంప్రదాయ పద్ధతిలో పెరుగుచున్న యువతి లలితాదేవిని చూచారు. అప్పటికి శాస్త్రిగారి వయస్సు 23 సంవత్సరాలు, ఆమె వయస్సు 18 సంవత్సరాలు. ఆ యువతి వదినెగారు లలితాదేవితో శాస్త్రిగారిని





చూడమని చెప్పి, వరుని గుణగణాలను వివరిస్తూ "బుద్ధిమంతుడు, బాగా చదువుకొన్నవాడు, పెద్దలతో బాగా పరిచయమున్నవాడు, అన్నివిధాల మంచివాడేకాని, ఒక కాలు ఇంట్లో వుంటే, ఒక కాలు జైల్లో వుంటుంది, దేశం, దేశం అని దేశభక్తితో తను తీరిక లేకుండా ఉంటాడు. నీ ఉద్దేశమేమిటి?" అని అడిగింది. అందుకు సమాధానంగా అన్న, వదినెల ఇష్టమే తన యిష్టమని చెప్పి సిగ్గుతో తలవంచుకొన్నది. అందుకు వదినెగారు "ఇంటిని స్వర్గంలా చేసుకోవడం స్త్రీ చేతిలోనే వుంది," అని ఆ పెండ్లికి ఒప్పుకోమని భర్తకు చెప్పింది. దానితో నిశ్చయతాంబూలాలు ఇచ్చి పుచ్చుకోవడాలు జరిగినవి. ఆ సందర్భంలో ఒక చిన్న సంఘటన జరిగింది. శాస్త్రిగారిని "మీకేమి కావాలి కట్న కానుకలు" అని అడిగితే ఒక చరఖా, నాలుగైదు గజాల ఖద్దరు బట్ట యివ్వండి చాలు అని చెప్పి, అంతకంటే కట్న, కానుకల కోసం బలవంతం చేస్తే, ఆ వివాహం తనకక్కరలేదని నిర్మొహమాటంగా చెప్పారు. ఆయనలోని సుగుణ సంపత్తికి అందరూ ఆనందించారు. పెండ్లి ముహూర్తం పెట్టుకొని, ఆ రోజున ఆయన కోరినట్లే ఆ చిరుకానుకను ఇచ్చి పెండ్లి జరిపించి, ఈడూ జోడూ కలిసిన అన్యోన్యమైన జంటను అందరూ ఆశీర్వదించి సంతోషించారు.

లాల్ బహదూర్ శాస్త్రిగారికి లలితాదేవి తగినభార్య. ఆమె తెల్లవారగానే లేచి చన్నీటి స్నానం చేసి భగవంతుని పూజచేసుకొని వంట వార్పూ చేసేది. పెద్దబొట్టు పెట్టుకొని ఎప్పుడూ చిరునవ్వుతో కళకళలాడుతూ ఉండేది. ప్రాచీన భారత సాంప్రదాయంలో, నిరాడంబరతతో ఎట్టి పరిస్థితులలోను ధైర్యాన్ని కోల్పోని ఆదర్శ వంతమైనగృహిణి.





అత్తగారికి, భర్తకు సేవలు చేస్తూ భగవద్భక్తితో ఇంటిని స్వర్గధామం చేసుకునే ఇల్లాలు.

లలితాదేవి అత్తగారైన రామదులారీదేవి నిష్ఠాగరిష్ఠురాలు. గంగాస్నానంచేసి, దైవపూజలాచరించి, తన కొడుకును కూడ ప్రతిదినము ఉదయాన్నే ఎంత చలిగా ఉన్నా సరే చన్నీటి స్నానం చేస్తేగాని ఏ పనీచెయ్యనిచ్చేది కాదు. స్త్రీలు బయటకు వెళ్ళవలసిన పనిలేదు. ఇంట్లోనే తగినంత పని ఉంటుంది. అని కోడలిని కొడుకుతో బయటకు పంపేదికాదు. ఆమె కిష్టమైనట్లే కొడుకు, కోడలు కూడ నడుచుకొంటూ దైనందిన జీవితంలో ఆనందం అనుభవించేవారు.

## శాస్త్రిగారి రాజకీయ జీవితానికి పల్లవింపు

ఇంగ్లాండునుండి ఇండియాకు కుయుక్తులతోవచ్చి భారతదేశంలో పర్యటిస్తున్న సైమన్ కమిషన్‌ను "సైమన్ కమిషన్ గోబాక్" అని నినాదాలు చేస్తూ నల్ల జండాలతో శాంతియుతంగా నిరసన తెలియ జేస్తున్న ప్రజానీకానికి నాయకత్వం వహించిన లాలా లజపతిరాయ్‌ని సాండర్స్ అనే బ్రిటిష్ పోలీసు అధికారి బలమైన దెబ్బలు కొట్టగా ఆయన శరీరం రక్తసిక్తం కావడంతో అసమాన దేశభక్తుడైన ఆ ప్రజానాయకుడు అసువులు బాసెను.


లాలాలజపతిరాయ్ చనిపోయిన తర్వాత "సర్వెంట్స్ ఆఫ్ ది పీపుల్సు సొసైటీకి పురుషోత్తమదాస్ టాండన్ అధ్యక్షులయ్యారు. టాండన్ అలహాబాద్‌లో ఉండడంతో శాస్త్రిగారి మకాం కూడా 1928 లో అలహాబాద్‌కు మార్చుకోవడం జరిగింది. వివాహమైన సంవత్సరానికి ఆయన కుటుంబం అలహాబాద్ చేరింది.

పురుషోత్తమదాస్ టాండన్ శాస్త్రిగారికి ప్రథమ రాజకీయగురువు. శాస్త్రి గారి నిజాయితీకి, కార్యాచరణదక్షతకు టాండన్ మహా సంభరితుడయ్యాడు. గురువుకు తగిన శిష్యుడులా వ్యవహరించి శాస్త్రి మంచిపేరు తెచ్చుకున్నారు. అలహాబాద్‌లో కూడ ఆయన హరిజనసేవాకార్య క్రమాల్ని విడిచిపెట్టలేదు. ఆ సమయంలో అనేకమంది కాంగ్రెస్ కార్యకర్తలతో మంచి పరిచయం ఏర్పడింది.

నెహ్రూ 1923లో అలహాబాద్ మున్సిపల్ అధ్యక్షపదవిని చేపట్టినారు. అయిదు సంవత్సరాల తర్వాత శాస్త్రి కూడ అదే సంస్థలో చేరి పురపాలకసంఘ కార్యక్రమాలలో కష్టించి పనిచెయ్యడం మొదలుపెట్టారు. ఆయన తోటి కార్యకర్త శ్రీ పి.ఎల్. శ్రీ వాస్తవ శాస్త్రి యొక్క పనిచేసేతీరుతెన్నులను ఎంతగానో ప్రశంసించారు.

1931 లో లాల్‌బహుదూర్‌శాస్త్రి అలహాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. అందుకు టాండన్ గారి అభిమానం బాగా పనిచేసింది. నెహ్రూగారికి టాండన్‌గారికి విధానాల్లో విభేదాలుండడం చేత వారిద్దరికి సఖ్యత పొసగేదికాదు. శాస్త్రి తన ఓర్పు, నేర్పులతో ఇద్దరి అభిమానాన్ని సంపాదించుకోగలిగారు. అలహాబాద్‌లో ఒక సంచలనాత్మక సంఘటన ఒకటి జరిగింది. ఆ రోజుల్లో సహాయ నిరాకరణోద్యమం ఉధృతంగా సాగుతున్నది. అప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలు, కొందరు విద్యార్థులు కలిసి అలహాబాద్ క్లాక్ టవర్ మీద త్రివర్ణపతాకమైన కాంగ్రెస్ జెండాను ఎగురవెయ్యాలని పూనుకున్నారు. అక్కడ పోలీసుల బందోబస్తు ముమ్మరంగా ఉండుటచే ఆ పని ఎవ్వరికీ సాధ్యపడలేదు.





గుర్రపుబండిలోంచి దిగి క్లాక్‌టవర్ వైపు బురఖాలో వెళుతున్న శ్రీ ... లాల్‌బహదూర్ శాస్త్రి

కాంగ్రెస్ కార్యకర్తలు (శ్రీమతి పూర్ణిమాబెనర్జీ (శ్రీమతి అరుణా అసఫాలీసోదరి) వద్దకు సలహాకొఱకు వెళ్ళారు. ఆమె యిచ్చిన సలహా అందరికీ నచ్చింది. ఒక రోజున నాలుగువైపులా మూసివున్న ఎక్కా(టాంగాలాంటిది) ఒకటి క్లాక్ టవర్ మెట్లముందు ఆగింది. ఆ గాడీలోనుంచి ఒక బురఖా వేసుకున్న స్త్రీ దిగిమెట్లుపైకి ఎక్కి వెళ్ళి పోయింది. పర్యాటక స్త్రీ ఎవరో వచ్చారని పోలీసులు ఏమీ పట్టించు కోలేదు. కొంతసేపటికి క్లాక్‌టవర్ మీద తివర్ణపతాకం ఎగరడం కనిపించింది. అక్కడ చేరిన జనులు హర్షధ్వానాలు చేస్తూంటే పోలీసులు ఆ దృశ్యాన్ని చూచి విస్తుపోయారు. అదే సమయానికి ఒక ధోవతి, చొక్కాతొడుక్కున్న పొట్టిగా బక్కపలచగా నున్న మనిషి వచ్చి "నా పేరు లాల్ బహదూర్ శాస్త్రి, క్లాక్ టవర్ మీద కాంగ్రెస్ జెండాను ప్రతిష్ఠించింది నేనే" అని సౌమ్యంగా నవ్వుతూ చెప్పాడు. పోలీసులు వెంటనే అతన్ని అరెస్టు చేసి జైల్లో పెట్టారు. అందుకు శాస్త్రిగారికి ఆరునెలలు జైలుశిక్ష అనుభవింపవలసి వచ్చింది.

గాంధీ జయంతి సందర్భంగా పురుషోత్తమదాస్ టాండన్ తన ఉపన్యాసం అయిన తర్వాత లాల్‌బహదూర్‌శాస్త్రి పుట్టిన తేదీ, గాంధీగారు పుట్టినతేదీ అక్టోబరు రెండే అని చెప్పడంతో సభ్యులంతా "లాల్‌బహదూర్‌శాస్త్రికి జై" అని హర్షధ్వానాలు చేశారు.

## గోవిందవల్లభపంత్ గారితో అనుబంధం

శాస్త్రిగారి నియమ నిబద్ధత, కార్యదక్షతచూసి మిత్రులు రెండవసారి కూడ ఆయన్ను అలహాబాద్‌జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. శాస్త్రిగారు జిల్లా అంతా పర్యటించి ప్రజలను బ్రిటిష్





ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రోత్సహిస్తూ, కాంగ్రెస్ కార్యకర్తలను ఉత్తేజపరుస్తూ తన అద్వితీయమైన ఉపన్యాసాలతో, అంకిత భావంతో పార్టీకి, ప్రజలకు హితుడై, సన్నిహితుడై శక్తివంచనలేకుండా కృషిచేశారు.

1937 లో యు.పి.లోని మహా నాయకుడైన గోవింద వల్లభపంత్ గారితో మంచి పరిచయం ఏర్పడింది. భారతదేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లో ఇటువంటి చిత్తశుద్ధిగల వ్యక్తికావాలని పంత్‌గారు ఆయనని అసెంబ్లీ ఎన్నికల ఎలక్షన్‌లో నిలబెట్టారు. అంతే ఆయనలోని ప్రతిభను చూసి ప్రజలు ఆయనని గెలిపించారు. గోవింద వల్లభపంత్ ముఖ్యమంత్రి కావడంతో శాస్త్రిని, సి.బి. గుప్తాతో పాటు పార్లమెంటరీ కార్యదర్శిగా తీసుకున్నారు. టాండన్ కు శాస్త్రి హితుడని తెలిసి పంత్ తన అసెంబ్లీలో ముఖ్యమైన స్థానంలో పదవిని అందించినారు. శాస్త్రిగారు ఋజుమార్గంలో నడిచేవ్యక్తి, ఎవరికీ కష్టం కలిగించని సరళ స్వభావి అందుచేత గోవిందవల్లభపంత్ కూడ శాస్త్రిలోని సుగుణాలకు ముగ్ధుడై తనుకూడ రెండవ రాజకీయ గురువుగా గురుతర బాధ్యతను స్వీకరించారు.

## నెహ్రూతో సుహృద్భావ సాన్నిహిత్యం

పురుషోత్తమ దాస్ టాండన్ కాంగ్రెస్ ప్రసిడెంటుగా ఉన్నంతకాలం ఆయనకు నెహ్రూకు సరిపడేదికాదు. ఒకరినొకరు విమర్శించుకొంటూ ఉత్తరధృవం, దక్షిణధృవంలా వుండేవారు. నెహ్రూగారికి కొంచెంకోపం ఎక్కువ. టాండన్‌గారికి కోపం లేదుగాని ఎంత చేసినా సంతృప్తిలేదు. కిద్వాయ్‌ని కాబినెట్ మంత్రిగా తీసుకున్నందుకు టాండన్ విమర్శకు నెహ్రూ విసుగెత్తి కిద్వాయ్‌ని తొలగించడమే కాకుండా తను కూడ

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి రాజీనామా చేశారు. అది టాండన్ తలబొప్పి కట్టడంతో తనుకూడ కాంగ్రెస్ ప్రసిడెంటు పదవికి రాజీనామా చేసి నెహ్రూనే ప్రసిడెంటుగా ఉండమని కోరడం జరిగింది.

కొందరు నాయకులు నెహ్రూతో శాస్త్రిని ప్రధాన కార్యదర్శిగా ఎంచుకోమని కోరారు. అందరినీ ఆకట్టుకొనే వ్యక్తి శాస్త్రియే అని నెహ్రూ గారికి కూడ తెలుసు. అందుచేత ఆ పదవికి ఆయననే ఉండమని కోరినారు. శాస్త్రి గారు ఆ పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తూ, అందరికీ తలలో నాలుకలాగ మెలగుట చిన్నతనం నుంచి ఉగ్గుపాలతో నేర్చుకొన్న విద్య అన్నట్లుగా ఉండేవారు. చిన్న చిన్న పొరపొచ్చాలు అప్పుడప్పుడు నాయకుల మధ్య పొడచూపినా శాస్త్రి తన చాకచక్యంతో వాటిని సవ్యంగా పరిష్కరిస్తూ అందరి మన్ననలకు పాత్రులయ్యారు. మొత్తంమీద శాస్త్రి నెహ్రూగారివైపే ఎక్కువగా ఆకర్షితులయ్యారు. నెహ్రూగారు కూడ శాస్త్రిని తన విశ్వాసపాత్రుడైన సహచరునిగా అభిమానించారు.

## యు.పి.సర్కారులో మంత్రిపదవి

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత1947లో యు.పి. ముఖ్యమంత్రిగా గోవిందవల్లభపంత్ ఉన్న రోజుల్లో శాస్త్రిగారు హోం, రవాణాశాఖల మంత్రిగా నియమింప బడ్డారు. ఆ రోజుల్లో మత కలహాలు విజృంభించి అల్లకల్లో పరిస్థితులు నెలకొన్నాయి. శాస్త్రిగారు ప్రజలను సముదాయించి తన చతరురత నంతా ఉపయోగించి మతసామరస్యం కలిగించి జన జీవితాన్ని శాంతి మార్గం వైపున నడిపించారు.





1951 లో జవహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్ పదవిని కూడ చేపట్టారు లాల్‌బహదూర్ శాస్త్రిని ప్రధానకార్యదర్శిగా ఎంచు కోవడంతో శాస్త్రిగారు తనకు తానుగా మంత్రిపదవిని వదులుకున్నారు.

యు.పి.లో శాస్త్రిగారు మంత్రిగా ఉన్నప్పుడు కొన్ని విచిత్ర సంఘటనలు జరిగాయి.

## శాస్త్రిగారి చెఱసాల జీవితం

ఆయన కారాగార గృహజీవితం చాల విశిష్టమైనది. గ్రామాలలోకి వెళ్ళి ప్రజలతో కలిసి పనిచేయడమంటే చాల యిష్టపడేవారు. దేశ స్వాతంత్ర్యం కొఱకు తన జీవితాన్ని అంకితం చేసిన భరతమాత ముద్దుబిడ్డ. సత్యాగ్రహోద్యమాలలో పాల్గొని బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేకసార్లు పికెటింగులు చేసి పోలీసుల లాఠీదెబ్బలు తిని జైళ్ళపాలై అకుంటిత దీక్షతో లక్ష్యసాధనకు కృషిచేసిన అసమాన దేశభక్తుడు . మొదటి సారి 1921లో అలహాబాద్ క్లాక్ టవర్ మీద కాంగ్రెస్ జెండాను ప్రతిష్ఠించి ఆరు నెలలు జైలుజీవితం అనుభవించారు. ఆ తర్వాత "క్విట్ ఇండియా" ఉద్యమంలో పాల్గొన్నప్పుడు అరెస్టుచేసి నైనీ సెంట్రల్ జైలుకు పంపించారు. డిటెన్షన్‌లో ఉండగా ఆయన వ్యక్తిత్వానికి చెందిన కొన్ని ప్రత్యేకతలు బహిర్గతమయ్యాయి. శాస్త్రి గారితో జైలులో ఉన్న కొందరు బయట నుంచి రకరకాలు వస్తువులను తెప్పించుకొని అనుభవించడం జరిగేది. కాని శాస్త్రిగారు మాత్రం జైల్లో ఖైదీల కిచ్చే వాటితోనే సరిపెట్టుకొనేవారు. ఆయనకు "బి" క్లాసు ఇస్తే "సి" క్లాసుకిచ్చే ఆహారమే తీసుకొనేవారు. నైనీ జైలులో ఉంటున్నప్పుడు "మేడమ్ క్యూరీ" జీవిత చిత్రను హిందీలోనికి అనువదించారు.

ఆ జైలు లోనే 1942-44 కాలంలో 200 మంది వరకు రాజకీయ ఖైదీలుండేవారు. వారందరికి నాయకత్వం వహించి ఆయనలోని సహజ సౌమ్యతతో అందరి మధ్య సామరస్యాన్ని సాధించారు. వాస్తవిక దృష్టితో అక్కడ ప్రశాంత జీవితాన్ని గడపడానికి కృషి సల్పినారు. ఆయనలోని హుందాతనం, ఆత్మాభిమానం ప్రశంసనీయం. జైలు అధికారులనుంచి ప్రమాదం ఏర్పడినప్పుడు వాటిని కాపాడుకోగల కరుకుతనం కూడ ఆయనలో ఉండేది. వివిధ సందర్భాలలో జైలు అధికారులతో జరిగిన వివాదాలలో శాస్త్రిగారు నాయకత్వం వహించి విజయం సాధించారు.

ఒకసారి అలహాబాద్‌లో నెహ్రూ, శాస్త్రి ఒకే జైలులో ఉండుట తటస్థించింది. కాని గదులు మాత్రం వేరు. శాస్త్రికి చదువుకోడానికి నెహ్రూ పుస్తకాలను పంపించేవారు. ఆయనకు మంచి మంచి పుస్తకాలను చదివే అవకాశం జైలులో లభించడంతో ఎంతో మేలు జరిగిందని సంతోషించేవారట. శాస్త్రిగారు ఎనిమిదిసార్లు జైలుకు వెళ్ళి పదిసంవత్సరాలు జైలు జీవితం అనుభవించారు. స్వాతంత్ర్య పోరాటంలో తన జీవితాన్ని సార్థకం చేసుకున్నారు తప్ప ఉన్నత పదవుల కోసం ఎప్పుడూ ఆశించలేదు. ఆయనకు ఎప్పుడు ఏ బాధ్యత అప్పగించినా సమర్థవంతంగా నిర్వహించి అందరి మన్ననలు పొందగిలిగేవారు.

ఆయన సామాన్య కుటుంబంలో పుట్టి, దేశ రాజకీయాలలో అత్యుత్తమ స్థానాలను అలంకరించి శభాష్ అనిపించుకున్నారు. కాని ఆయన జీవితంలో దారిద్ర్యాన్ని అనుభవించినా ఎప్పుడూ బాధపడలేదు.

లలితాదేవి భర్తకు అనుకూలంగా నడుచుకొనే భార్య. రోజులు ఎప్పుడూ ఒకేలావుండవు, మార్పు వస్తుంది అని నమ్మకంతో వుండేది. వారిద్దరు ఆదర్శదంపతులు.





జవహర్‌లాల్‌నెహ్రూ ప్రధానమంత్రి పదవి, ఆలిండియా కాంగ్రెస్ ప్రెసిడెంటు పదవి రెండూ నిర్వహిస్తూ, లాల్ బహదూర్ శాస్త్రిని కాంగ్రెస్ పార్టీకి ప్రధానకార్యదర్శిగా రమ్మని కోరడంతో యు.పి.లోని మంత్రిపదవికి రాజీనామా చేసి నెహ్రూ గారి దగ్గరచేరడానికి ఢిల్లీ వెళ్లారు. దానితో భారత ప్రజలందరి దృష్టి శాస్త్రి గారి మీద పడింది.

## ఆల్ఇండియా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పదవి

1952లో మొట్టమొదటిసారిగా జనరల్ ఎలక్షన్సు జరుగబోతున్నాయి. వాటి బాధ్యతను నెహ్రూగారు శాస్త్రిగారికి అప్పగించారు. అదేమీ ఆషామాషీ వ్యవహారం కాదు. అభ్యర్థులను ఎంపిక చేసి నిలబెట్టడం కత్తిమీద సాములాంటిపని. శాస్త్రిగారు ఆ పనిని ఎంతో వివేకంతో ఆచి తూచి నిర్వహించారు. అందుకు ఎవ్వరూ వేలెత్తి చూపకుండా, ఆయన నిష్పక్షపాత వైఖరికి, బుద్ధికుశలతకు అందరూ సంతోషించారు. కాంగ్రెస్ విజయం సాధించి దేశసేవకు అంకితమయ్యింది.

1957 ఎన్నికల్లో శాస్త్రిగారు కూడ ప్రచారానికి బయలుదేరారు. ఆయన జీపు "జసరా" అనే ఊరు దగ్గర ఆగగానే ఎర్రజెండాలతో జనం వచ్చి జీపును చుట్టుముట్టారు". అయ్యా మేము విధిలేక కాగ్రెస్ నుండి విడిపోయి కమ్యూనిష్టు జెండాలు పట్టాము. మీరు మా కోరిక తీరిస్తే అంతా కాంగ్రెస్‌కే ఓట్లేస్తాము". అని చెప్పారు". అలాగే మీ కోరిక తీరుస్తాము" అని అందరిలాగా అనకుండా "మీ కోరికేమిటో చెప్పండి, తీర్చడం సంగతి తర్వాత విషయం" అని అడిగారు శాస్త్రిగారు. దానికి వాళ్ళు "మా ఊరు" జసరా అక్కడ మెయిలుని ఆపించాలి"

అన్నారు సరే, మీకోరిక బాగానే వుంది. మీరు కోరినట్లుగానే మీ ప్రక్క గ్రామంవారు, ఆ ప్రక్కగ్రామంవారు కూడ అడిగేరనుకోండి. అప్పుడు మెయిలు ప్రతిస్టేషన్‌లోను ఆగితే అది ప్యాసింజరు బండిలా తయారవుతుంది. అప్పుడు టపా సకాలంలో అందకపోతే అందరితోపాటు మీకు కూడ ఇబ్బంది కాదా?" అని వివరించి సాధకబాధకాలను వారికి తెలియజేయడంతో వారికోరికను విరమించి ఎర్రజెండాలను పారవేసి "లాల్‌బహదూర్ శాస్త్రికి జై" "కాంగ్రెస్‌కిజై" అని నినాదాలు చేసి, కాంగ్రెస్ పార్టీ ఓట్లెయ్యడాని సంసిద్ధతనను వ్యక్తం చేశారు.

శాస్త్రిగారు ఎలెక్షన్సు విషయంలో రాత్రింబవళ్ళు కష్టించి పనిచేశారు. ఢిల్లీలో జంతర్ మంతర్ రోడ్డులో ఉన్న ప్రధాన కాంగ్రెస్ కార్యాలయ ఆవరణను విడిచి ఆయన వెళ్ళలేదు. ఆ కర్మయోగి కృషిఫలితంగానే కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. ఆయన నిర్విరామ కృషి, ప్రతిభ అందరికీ బాగా తేటతెల్లమయ్యింది.

## రైల్వే రవాణా శాఖల మంత్రిపదవి

జనరల్ ఎలక్షన్సు తర్వాత శాస్త్రిగారు రాజ్యసభకు ఎన్నికైనారు. నెహ్రూగారు ఆయనకు రైల్వే, రవాణాశాఖల మంత్రిగా పదవి ఇచ్చారు. అప్పటినుంచీ శాస్త్రిగారు నెహ్రూగారి కుడిభుజంలా పనిచేస్తూ వచ్చారు.

రైల్వే శాఖమంత్రి తన ప్రయాణాలకు రైల్వేసెలూన్ ఉపయోగించుకోవచ్చు. కాని శాస్త్రిగారు రైల్వేసెలూన్ ఎప్పుడూ వాడుకోలేదు. ఆయన రైల్వే శాఖమంత్రి అయిన కొత్తరోజుల్లో బొంబాయిలో అఖిలభారత కాంగ్రెస్ మహాసభలు జరుగుతున్నాయి. వాటికి శాస్త్రిగారు కూడ





హాజరవుతున్నారు. బొంబాయి స్టేషన్‌లో మంత్రి గారిని ఆహ్వానించడానికి ఆయన మిత్రులు, కాంగ్రెస్ కార్యకర్తలు వచ్చారు. రైల్వేసెలూన్ దగ్గర ఆయన కనపడకపోయేసరికి రాలేదేమో అనుకొని వెళ్ళిపోతుంటే, శాస్త్రిగారు సెకండుక్లాస్ పెట్టెనుండి దిగివస్తుంటే చూచి వాళ్ళు పరమానందంతో రాలేదేమో అనుకున్న మంత్రిగారు వచ్చారని సంతోషంతో పూలమాలలు వేసి, జయజయధ్వానాలు చేసి బయటకు తీసుకువెళ్ళారు. ఆయన ఎంత నిరాడంబరుడో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

## నైతిక బాధ్యతతో మంత్రి పదవికి రాజీనామా

శాస్త్రిగారు రైల్వేశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆ శాఖలో ఎన్నడూ లేనంతగా మంచి మార్పులు తెచ్చారు. మూడవ తరగతి ప్రయాణీకులకు చాల సౌకర్యాలు కల్పించారు. అవినీతిని నిర్మూలించ డానికి అనేక చర్యలు తీసుకున్నారు. రైల్వేస్టేషన్సులో మంచి నీటి ఏర్పాట్లు మెరుగుపరిచారు. కాంటీన్సులో ఆహారవిషయంలో బాగా శ్రద్ధ చూపించారు. విశ్రాంతి గదులలో టాయ్‌లెట్సు (స్నానాలు వగైరాగదులు) పరిశుభ్రత కూడ ముఖ్యమైన విషయంగా తలచి అంటురోగాలను తగ్గించే చర్యలు తీసుకున్నారు. ఆ మంత్రి పదవిని నాలుగు సంవత్సరాలు సమర్థవంతంగా నిర్వహించి 1956 లో రైల్వేశాఖామంత్రిపదివికి రాజీనామా చేశారు. మహబూబ్‌నగర్‌వద్ద, అరియలూర్ వద్ద రైలుప్రమాదాలు జరుగుటవలన వాటికి ఆయన ఎంతగానో బాధపడి ఆపదవికి రాజీనామా చేశారు. ఆ విషయం గురించి ఎంతోకాలం విచారంగా ఉండేవారు.

ఆయన రాజీనామా చేసినందుకు శాస్త్రిగారి నైతిక బాధ్యతను గురించి చాలమంది పొగిడినారు. కాని నెహ్రూగారు మాత్రం వద్దని చెప్పినా శాస్త్రిగారు ఆయన హితవును సున్నితంగా త్రోసిపుచ్చి, తన ఆత్మ ప్రబోధాన్నే అనుసరించారు.

శాస్త్రిగారు తన మంత్రి పదవికి రాజీనామా చేసి పార్లమెంటు భవనం లోంచి బయటకు వచ్చేసరికి కారు సిద్ధంగా వుంది. డ్రైవరుతో "నేను మంత్రిపదవికి రాజీనామా చేశాను కాబట్టి కారును వెనక్కుతీసికొనివెళ్ళు" అని చెప్పి, కాలినడకన పార్లమెంటు భవనానికి దగ్గరలో నున్న బస్‌స్టాప్‌కు వెళ్ళి సిటీబస్ ఎక్కి ఇంటికి వెళ్ళిపోయారు. ఇంటిదగ్గర కారులో రాలేదేమని అడిగితే "నేను మంత్రిపదవికి రాజీనామా చేశాను. అందుచేత ప్రభుత్వ వాహనం వాడకూడదు కదా" అని సమాధానం చెప్పారట. ఆయన నిస్వార్థతకు, నిరాడంబరతకు ఇది చక్కని ఉదాహరణ.

1957 లో శాస్త్రిగారు లోక్‌సభకు ఎన్నికైనారు. నెహ్రూగారు ఆయనకు రవాణా, కమ్యూనికేషన్సు మంత్రిపదవిని ఇచ్చారు. తనకు మంత్రిపదవి చేపట్టడం ఇష్టం లేకపోయినా నెహ్రూగారి వత్తిడి వల్ల అంగీకరించక తప్పలేదు. అయినా విధి నిర్వహణలో మాత్రం ప్రతిభతో పనిచేయడం ఆయన సహజగుణం. శాస్త్రిగారు 1958 మార్చి వరకు ఆ పదవిని నిర్వహించి, వాణిజ్య పరిశ్రమలశాఖామంత్రిగా ఉన్న టి.టి.కృష్ణమాచారి రాజీనామా చేయడం వల్ల ఆ పదవిని ఈయన స్వీకరించారు.

వాణిజ్య పన్నుల శాఖామంత్రిగా శాస్త్రిగారు ఎక్కువగా పేరు సంపాదించకపోయినా, ఆయన నీతి, నిజాయితీలను మాత్రం అందరు కొనియాడారు. ప్రజల బ్రతుకు భారంగా మారే విషయాలకు మాత్రం





ఆయన అంగీకరించేవారు కాదు. దారిద్ర్యరేఖకు క్రిందనున్న వారికి, సామాన్యులకు కష్టం కలిగించకుండా పరిపాలనలో జాగ్రత్తపడేవారు. 1961 వరకు ఆపదవిలో కొనసాగారు.

## శాస్త్రి గారి హోం మంత్రిపదవి

ది. 7-3-1961 తేదీన గోవింద వల్లభపంత్ దివంగతులైనారు. దానితో ఆయన నిర్వహించే హోంశాఖను శాస్త్రిగారికిచ్చారు నెహ్రూగారు. 1962 ఎలక్షన్లలో శాస్త్రిగారు, పార్లమెంటుకి ఎన్నిక కావడంతో హోంశాఖామంత్రి గానే తిరిగి పదవిలో కొనసాగడం జరిగింది.

కేంద్ర పరిపాలనలో హోంశాఖ అతిముఖ్యమైనది. నిర్దుష్టమైన మార్పులతో "సంస్కరణల సంఘా"న్ని కేంద్ర పరిపాలనా వ్యవస్థను సరిదిద్దడానికి ఏర్పాటు చేశారు. సంతానం కమిటీని నియమించారు. ఇలా ఆయన తన శాఖను చక్కగా నిర్వహిస్తూనే నెహ్రూ గారికి తోడుపడుతూ వచ్చారు. అనేక సమస్యలలో శాస్త్రిగారిది నిష్పక్షపాతమైన వైఖరి. ఆయన కష్టజీవులపాలిట కల్పవృక్షం. అందుచేత ఆయన తీరుతెన్నులు ఎప్పుడూ దేశాభివృద్ధికే తోడ్పడేవి. లంచగొండితనం, అవినీతినిర్మూలన ఆయన ప్రధానలక్ష్యం. ఆ విషయంలో మాత్రం తు.చ. తప్పకుండా ధర్మమైన మార్గాన్నే అవలంబించేవారు.

శాస్త్రిగారికి పదవులపట్ల వ్యామోహంలేదు. ఎంత త్యాగానికైనా ఎప్పుడైనా సిద్ధమే. అంతేకాదు ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి న్యాయంచేకూరేలా కష్టించి పనిచేయడం ఆయనకు వెన్నతోపెట్టిన విద్యలా ఉండేది.



నెహ్రూగారు అప్పగించిన ప్రతిపనిని శాస్త్రిగారు నా బొందో అని నిద్రాహారాలు మాని అయినాసరే నిర్విఘ్నంగా కొనసాగించేవారు.

ఆయన మంత్రిగా ఉన్నప్పుడు కూడా పర్యటనలో ఎప్పుడూ రెస్టుహౌస్‌లను ఉపయోగించుకోలేదు. అలహాబాద్ ఎప్పుడు వెళ్ళినా ఆయన అద్దెయింటినే వాడుకొనేవారు. ఆయన ఢిల్లీలో ఉన్నా ఆ యింటిని విడిచిపెట్టలేదు. కాని ఇంటి యజమాని నోటీసు ఇవ్వడం వల్ల 1962లో ఆ అద్దెయింటిని విడిచిపెట్టారు.

అలహాబాద్‌లో ఒక ఇంటిని కొని స్వంతయింటిని సంపాదించుకోవాలని ఎంతో ప్రయత్నం చేశారు. అయినా ఆ ప్రయత్నం ఫలించలేదు. ఎవరైనా మంత్రిపదవిలో ఉన్నప్పుడు ఏదైనా కొనాలంటే అవతలి వాళ్ళే వచ్చి ఆ పని పూర్తిచేస్తారు. కాని శాస్త్రిగారి విషయంలో అలా జరుగలేదు. అందుకు కారణమేమిటంటే ఇంకోలా మినిష్టరైతే ఆ యింటి యజమానికి ఇంకోవిధంగా సహాయ పడడానికి ముందుకు వస్తారు. కాని శాస్త్రిగారు అలా కాదు, నీతి నియమాలు పాటించే యదార్థపు వెంకన్న. అందుచేతనే ఆయనకు ఎక్కువ ధర చెప్పేవారు. ఎక్కువ ధరపెట్టి కొనడం ఆయనకు ఇష్టంలేదు. అందుచేతనే స్వంతయిల్లు సమస్య ఎక్కడ వేసినగొంగళి అక్కడే అన్నట్లు వుండిపోయింది.

కేంద్ర మంత్రుల్లో స్వంతయిల్లు లేనివారు శాస్త్రిగారు తప్ప మరెవ్వరూ లేరు.

నెహ్రూగారికి కుడి భుజంగా వుండి, అంతర్జాతీయంగా రాయబార రంగంలో ప్రముఖ పాత్రవహించి ఉద్రిక్తలను తొలగించి శాంతి సాధనకు ఆయన చేసిన కృషి అమోఘం.







నేపాల్‌లో అంతర్జాతీయసంబంధాలు విషమించగా శాస్త్రిగారు నేపాలు వెళ్ళి అక్కడ నాలుగురోజులుండి నేపాల్‌కు భారతదేశానికి మైత్రీభావం పెంపొందించి పరిస్థితులను చక్క బరచిన ఘనత శాస్త్రిగారికే దక్కింది.

కాశ్మీర్‌లో రాజకీయాల్లోను, హజరత్‌బల్ పవిత్రదేశం అదృశ్యమైన సందర్భంలోను ఆయన చాకచక్యంతో పరిస్థితులను శాంతియుతంగా పరిష్కరించి జనజీవనంలో ప్రశాంత వాతావరణాన్ని కలిగించి వచ్చారు.

శాస్త్రిగారు 1963 వరకు కేంద్రమంత్రి వర్గంలో వివిధశాఖల మంత్రి పదవులను 11 సంవత్సరాలు సమర్థవంతంగా నిర్వహించి, కామరాజనాడార్ పథకానికి కాంగ్రెస్ వ్యవహారాలను పటిష్టంచేసే నిమిత్తం ముందుగా పదవీ త్యాగం చేసి వచ్చినవారు శాస్త్రిగారే. అది నెహ్రూగారికి ఇష్టంలేకపోయినా తనత్యాగనిరతిని వీడలేదు. ఆయన కేంద్ర మంత్రివర్గానికి ఎక్కువకాలం దూరంగా ఉండలేకపోయారు. 1964 లో భువనేశ్వర్‌లో కాంగ్రెస్ సమావేశం జరుగుచున్నప్పుడు నెహ్రూగారికి అకస్మాత్తుగా గుండె పోటురావడంతో శాస్త్రిగారిని పోర్టుఫోలియో లేని మంత్రిగా నియమించడం జరిగింది. అయినా ఆయనను విదేశాంగ వ్యవహారాల శాఖ, మంత్రి వర్గ కార్యదర్శిశాఖ, ఏటమిక్ ఎనర్జీ శాఖల బాధ్యతలు ఆయనను పరిశీలించవలసిందిగా కోరడమైంది. అప్పటివరకు ఆ శాఖలు నెహ్రూగారి చేతిలోనే ఉండేవి.

నెహ్రూగారు లాల్‌బహదూర్ శాస్త్రిలోని గొప్పతనం చూసి, నిజాయితీని పరిశీలించి ఆయనే తన వారసుడుగా కాబోయే ప్రధాన మంత్రిగా రావాలనే ఆకాంక్ష ఉన్నట్టుగా ఆయన శాస్త్రిగారికిచ్చే ప్రాధాన్యతను బట్టి అర్థం చేసుకోవచ్చు. శాస్త్రిగారు కూడ తన


కార్యనిర్వహణలో నిమ్నగమై, నెహ్రూగారిలాగే అర్ధరాత్రివేళ బయటకు వచ్చిన రోజులు అనేకం వున్నాయి. అంతేకాదు పార్లమెంటులో తన పార్టీవారి అండదండలతోపాటు, ప్రతిపక్షాల అభిమానాన్ని కూడ చూరగొన్న అజాత శత్రువు.

## శాస్త్రిగారికి ప్రధానమంత్రి పదవి

నెహ్రూగారు ది. 27-5-1964 వ తేదీన స్వర్గస్తులైనారు ఆ సందర్భంలో నాలుగు రోజుల తర్వాత కాంగ్రెస్ కార్య నిర్వాహక ప్రత్యేక సమావేశం జరిగింది. నెహ్రూగారి వారసుడుగా, ప్రధానిగా ఎవరిని ఎన్నుకోవాలనే చర్చ జరిగింది. అప్పుడు చాలమంది సభ్యులు లాల్‌బహదూర్ శాస్త్రిగారి పేరును సూచించారు. అందుకు ఆయన ఏకగ్రీవంగా ఎన్నుకుంటేనే తప్ప తనకిష్టంలేదని చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ సభ్యులందరూ ఒకే అభిప్రాయంతో ఉన్నారని కామరాజనాడార్ ప్రకటించడంతో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సభ్యులు సుమారు 500 మంది ఏకగ్రీవంగా తమ నిర్ణయాన్ని వెలిబుచ్చడంతో శాస్త్రిగారిని ప్రధానమంత్రిగా ఆమోదించడం జరిగింది.

శాస్త్రిగారు సర్వమానవులు సమానమనే సోషలిస్టు సమాజాన్ని నెలకొల్పి, అన్ని దేశాలతో మైత్రీభావం పెంపొందించి, ప్రపంచశాంతికి చిత్తశుద్ధితో పనిచేయడం మనలక్ష్యం కావాలని రేడియో ద్వారాదేశ ప్రజల నుద్దేశించి ప్రధానమంత్రిగా మొదటి ప్రసంగం చేశారు. ఆయన వడిదుడుకులు లేకుండా పూర్వాపరాల సమన్వయంతో అభివృద్ధి ప్రధానంగా దేశాన్ని ముందుకు తీసికొని వెళ్ళాలని రాత్రింబగళ్ళు శ్రమించారు. అటువంటి నిస్వార్థ పరుడైన ప్రజాబంధువుకే అగ్నిపరీక్షలు మొదలయ్యాయి. ఆ గడ్డు సమస్యలలో ముఖ్యమైనవి ఆహార ధాన్యాల





కొఱత, వాటి ధరల పెరుగుదల, కాశ్మీర్ సమస్య, షేక్ అబ్దుల్లా నిర్బంధం, పాకిస్తాన్‌తో సంఘర్షణలు, కచ్,కాశ్మీర్లలో పాకిస్తాన్ ప్రచ్ఛన్నయుద్ధం మొదలైనవి. శాస్త్రి పొట్టివాడైనా గట్టివాడు. వాటన్నిటిని ధైర్యములతో పరిష్కరించడానికి పూనుకున్నాడు. "దుర్బలంగా కనిపిస్తూనే దృఢంగా వ్యవహరించగల దక్షుడు లాల్‌బహదూర్ శాస్త్రి" అని విదేశీ పత్రికలు కూడా వ్యాఖ్యానించాయి.

ఒకసారి నెహ్రూగారు శాస్త్రిగారిని ఒంటరిగా పిలిచి "నీకు అకచన్ (అంటే గొంతుకవరకు గుండీలు వుండే పొడవైనకోటు) ఉందా" అని అడిగారట. లేదని సమాధానం "అయితే రెండు అకచన్‌లు కుట్టించుకో" అన్నారట నెహ్రూగారు "ఎందుకు?" అని శాస్త్రిగారి ప్రశ్న అప్పుడు నెహ్రూగారు "జూలైలో లండన్‌లో జరిగే కామన్‌వెల్తు ప్రధానమంత్రుల సమావేశానికి నాతోపాటు నువ్వు కూడా రావా?" అన్నారట.

తరవాత రెండవరోజునే నెహ్రూగారు అంతిమశ్వాస విడిచారు. 1964 లో కామన్‌వెల్తు సమావేశాలు లండన్‌లో జరిగాయి. దానికి భారత ప్రధాని శాస్త్రిగారు హాజరుకావాలి. కాని ఆయనకు అనారోగ్యంవల్ల వెళ్ళలేకపోయారట.

## ప్రధానమంత్రిగా ఘనవిజయాల సాధన

శాస్త్రిగారు ఇరుగుపొరుగు దేశాలతో భారతదేశం సత్సంబంధాలు కలిగియుండడానికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేవారు.

భారతీయులు కొందరు సింహళదేశం (శ్రీలంక) కు వలసవెళ్ళారు. వారికి అనేక సమస్యలు ఎదురు కావడంతో వారి పరిస్థితి దుర్భరంగా మారింది. అప్పుడు సింహళ ప్రధాని శ్రీమతి సిరిమావో భండార





నాయకేతో సంప్రతింపులు జరిపి వారి పరిస్థితి చక్కబరచి రెండు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మెరుగు పరిచారు.

బర్మా వెళ్ళిన భారతీయులకు కూడ అక్కడ వ్యాపారమును ఆ ప్రభుత్వం జాతీయం చేయడంతో గడ్డు సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. దానితో భారతీయులు కాందిశీకులుగా తిరిగి రావలసిన ఆవశ్యకత కలిగింది. అప్పుడు విదేశాంగమంత్రి స్వరణ్‌సింగును బర్మాకు పంపించి అక్కడ నెలకొన్న అపోహలను తొలగించి, బర్మాప్రధాని జనరల్ నెవిన్‌ను ఇండియాకు రమ్మని ఆహ్వానించారు. ఇద్దరు ప్రధానమంత్రులు సామరస్య చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించడంతో ఇరుదేశాల మైత్రి బలపడింది.

ఆఫ్ఘనిస్థాన్ ప్రధానమంత్రి డాక్టర్ యూసఫ్ భారతదేశం వచ్చినప్పుడు ఆయనతో స్నేహపూర్వక సంభాషణల ద్వారా రెండు దేశాలకు సహాయ సహకారాలు పటిష్ఠమయ్యాయి.

చైనా, పాకిస్తాన్ దేశాలు మాత్రం స్వార్థచింతనతో శాస్త్రిగారి శాంతి కారక ప్రయత్నాలకు సహకరించక పోవడంతో వారితో చర్చలు కొనసాగించలేకపోయారు. మిగతా అన్ని దేశాలతో శాస్త్రిగారు సత్సంబంధాలను ఆశాజనకంగా మార్చారు.

1965 లో నేపాల్ వెళ్ళి అక్కడ రాజుతో సంప్రదింపులు జరిపి ఆదేశరాజు, రాణిని భారతదేశానికి ఆహ్వానించారు. ఈ దేశంలో వారు పర్యటించి వెళ్ళిన తర్వాత భారతదేశ ప్రజల గురించి, ప్రధానమంత్రి గురించి ఎంతగానో మెచ్చుకుంటూ వారి ఆదరాభిమానాలు మరువరానివని రేడియో ప్రసంగాలతో నేపాల్ ప్రజలకు తమ సందేశమందించారు.


లాల్‌బహదూర్ శాస్త్రి ఈజిప్టు ప్రధాని నాజర్‌తో




ది. 2-10-1944 వ తేదీన శాస్త్రిగారు ఈజిప్టు రాజధాని కెయిరో చేరినారు. అలీనరాజ్యాల సమావేశంలో పాల్గొనే నిమిత్తం. ఆ రోజున ఆయన 60 వ జన్మదినోత్సవం. ఈజిప్టు ప్రధాని నాజర్ శాస్త్రిగారి జన్మదినోత్సవం అక్కడ ఘనంగా జరిపించి విందు ఏర్పాటు చేశారు. అప్పుడు శాస్త్రిగారు ఎంతో సంతోషించి, వారికి కృతజ్ఞతలు తెలియజేసి, విదేశాలలో తన జన్మదినోత్సవం చేసుకోవడం అదే ప్రథమ మని చెప్పినారు.

ఆయనకు అలీన రాజ్యాల శిఖరాగ్ర సమావేశంలో ఆసియాదేశాల ప్రతినిధిగా మాట్లాడే అవకాశం లభించింది. అణ్వాయుధాల ఉత్పత్తిని నిలుపుచేసే నిమిత్తం ఒక ప్రతినిధి వర్గాన్ని చైనాకు పంపించాలని ఆయన స్పష్టంగా ఆ అవసరాన్ని వివరించారు. తను ప్రతిపాదించిన అయిదు సూత్రాలతో పాటుగా, శాస్త్రిగారు ఆ సమావేశంలో ఎక్కువ ఏదశాల సభ్యుల విశ్వాసాన్ని పొందగలిగారు.

ఆయన 1964 డిశంబరులో లండన్‌వెళ్ళారు. అక్కడ బ్రిటన్ ప్రధానమంత్రి విల్సన్‌తో చర్చలు చరిపారు. ఇండియాకు బ్రిటన్‌కు సత్సంబంధాల వృద్ధికొఱకు శాస్త్రిగారు తన సహజ సౌమనస్యంతో విల్సన్‌ను మెప్పించి తన తెలివితేటలు ప్రదర్శించారు అక్కడి పత్రికలు ఆయన ప్రతిభకు జోహారు లర్పిస్తూ ప్రశంసల జల్లులు కురిపించాయి.

భారతదేశంలో కొందరికి, శాస్త్రిగారికి కాంగ్రెస్ వ్యవహారాలు తప్ప అంతర్జాతీయ వ్యవహారాలు తెలియవనే అపోహవుండేది. విదేశాలలో ఆయన కనబరచిన చాకచక్యం, అక్కడ పత్రికలు ప్రచురించిన ప్రశంసలు ప్రపంచమంతా వ్యాపించడంతో వారి అపోహలు పటాపంచలయ్యాయి.



లండన్ వెళుతున్న లాల్‌బహదూర్, రాధాకృష్ణన్, స్వరణ్‌సింగ్



శాస్త్రిగారు లియోటాల్‌స్టాయ్ రచించిన ఉద్గ్రంథాలు, కారల్‌మార్క్సు లిటరేచర్‌ను బాగా చదివారు. వాటి స్ఫూర్తితోనే 1965 మే నెలలో 8 రోజులు రష్యాను సందర్శించి ఇండియా రష్యా సంబంధాల పతిష్ఠతకే కాక ప్రపంచశాంతికి కూడ ప్రయోజనకారిగా ఆదేశనాయకులతో చర్చలు జరిపి సౌజన్యముతో వారి ఆదరాభిమానాలను చూరగొన్నారు. సోవియట్ ప్రజలు నెహ్రూగారివలెనే శాస్త్రిగారు కూడ శాంతి కాముకుడని కొనియాడారు. రష్యా విదేశాంగమంత్రి గ్రోమికో ఆయనకు సముచితరీతిలో వీడ్కోలు పలికారు.

1965 జూన్‌లో ఆయన కెనడా పర్యటన కూడ ఫలప్రద మయింది. అక్కడ విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ బిరుదునిచ్చి సత్కరించింది. అలాగే బ్రిటన్‌లో కామన్‌వెల్తు ప్రధానమంత్రుల సమావేశానికి హాజరైనప్పుడు కూడ శాస్త్రిగారికి ఎనలేని గౌరవం లభించింది. ఆ సభలో ఆయన చేసిన ప్రసంగాలు కూడ అందరినీ ఆకర్షించాయి.

ది. 30-7-1965 న యుగోస్లావియా వెళ్ళి మార్షల్ టిటోతో చర్చలు జరిపారు. అవి రెండు దేశాల ప్రయోజనాలకు దోహదపడడమే కాక ప్రపంచశాంతి, సహజీవనాలకు కూడ దారితీశాయి.

ది. 21-12-1965 నుండి 23-12-1965 వరకు బర్మా (మియన్మార్)లో పర్యటించి నెవిన్‌తో చర్చలు జరిపి వారితో వాణిజ్య సంబంధాలు మెరుగు పరచేందుకు, అక్కడ భారతీయుల సౌకర్యాల పునరుద్ధరణకు సుహృద్భావవాతావరణం నెలకొల్పి తిరిగి ఇండియాకు వచ్చి బర్మాయాత్ర ఎంతో సంతృప్తిని కలిగించిందని విమానాశ్రయంలో పత్రికా విలేఖరులకు చెప్పారు.

# సౌజన్యహృదయుని వజ్రసంకల్పం

ఏ పనినైనా సరే బాగా ఆలోచించకుండా తొందరపడి ఏనిర్ణయం తీసుకోరు, నిర్ణయం తీసుకున్నాక ఆ పని నెరవేరేవరకు పట్టువిడిచి పెట్టరు శాస్త్రిగారు.

భారతభూభాగమైన "కచ్" లోని "రాణ్" ప్రాంతంపై పాకిస్తాన్ దురాక్రమణ జరిపి యుద్ధ వాతావరణం కల్పించడంతో లాల్ బహదూర్ శాస్త్రి తన విశ్వరూపమైన వీరత్వాన్ని (వామనావతారంలాగా) ప్రదర్శించారు. మనదేశగౌరవానికి భంగం కలుగకుండా బ్రిటిష్ ప్రధానమంత్రి రాజీ ప్రతిపాదనలు చేస్తే అందుకు శాస్త్రిగారు అంగీకరించారు. ఒక ప్రక్క సంధి ఒప్పందాలు పూర్తి కాకుండానే పాకిస్తాన్ ముందుగా సాయుధ దుండగులను, తర్వాత సైన్యాన్ని కాశ్మీరు సరిహద్దులకు పంపి దురాక్రమణకు పాల్పడింది. అప్పుడు శాస్త్రిగారు భారతదేశం నలుమూలలా పర్యటించి ప్రజలను ఉత్తేజపరచి, సైన్యానికి అండదండలు అందించి దురాక్రమణను త్రిప్పి కొట్టమని సైన్యాన్ని ముందుకు దూసుకువెళ్ళే ఉత్సాహాన్ని కల్పించారు. మనదేశ భద్రతకు, సార్వభౌమత్వానికి భంగం వాటిల్లే పరిస్థితుల్లో భారతజాతి అంతా ఒక్కటై నిలుస్తుంది, ఏ త్యాగానికైనాసంసిద్ధం, భారతభూభాగం ఒక్క అంగుళం కూడ పరాయి వారి స్వాధీనం కానివ్వం అని హెచ్చరించి సైన్యానికి ప్రజలకు కూడ ధైర్యసాహసాల్ని నూరి పోశారు. యావద్భారతజాతి కాశ్మీరు సోదర సోదరీమణులకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.





"జై జవాన్," "జైకిసాన్" అనే నినాదముతో దేశప్రజలందరిని సమైక్యపరచి, ఏ త్యాగానికైనాసిద్ధంకావాలని హెచ్చరించి, వీలైన పక్షంలో వారానికి ఒకరోజు సోమవారం ఉపవాసముండి, దానితో ఆదా అయిన డబ్బును యుద్ధనిధికి విరాళంగా ఇవ్వమని విజ్ఞప్తి చేశారు.

ఆ సందర్భంలోనే ఆంధ్రప్రదేశ్‌లో అనేక సంస్థలు, వ్యక్తులు యుద్ధనిధి కొఱకు సేకరించిన లక్షల కొలది ధన విరాళాలేకాక, తొమ్మిది లక్షల గ్రాముల బంగారం ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిగారికి విరాళంగా ఇచ్చారు. ఇంత అధిక యెత్తున విరాళంగా నైతేనేమి, బాండ్లలో పొదుపు పెట్టే నిమిత్తమైతేనేమి ఏ యితర రాష్ట్రంలోను అందించలేదు. ఇది ప్రధాని శాస్త్రిగారికి అమితానందం కలిగించినట్లు ఆయన ప్రఫంగాలలో కూడ సవ్యక్తమయ్యింది. ఆయన హైదరాబాద్‌లో ఫతేమైదాన్‌లో ఉపన్యాస మిచ్చినందువల్ల దానిపేరు లాల్‌బహదూర్ స్టేడియంగా క్రొత్తహంగులతో మార్పు చెందింది.

పాకిస్తాన్ యుద్ధానికి దారితీసిన పరిస్థితులేమిటంటే అమెరికా నిర్భేద్యమైన పాటన్ టాంకులను యుద్ధరంగంలో ఎదురులేని దాడికి పనికివచ్చేవి అందించారు. వాటి అండచూచుకొని పాకిస్తాన్ దురాశతో యుద్ధానికి దిగింది. అప్పుడు మన ఏటమిక్స్ రీసెర్చి సైంటిష్టు డాక్టర్ హోమీజహంగీర్‌బాబా చిన్న చిన్న రాకెట్లు తయారు చేసి మన సైన్యానికి అందించారు. వాటితో పాటన్ టాంకులు తుత్తునియలుగా విచ్ఛిన్నంకావడంతో పాకిస్తాన్ సైన్యాలు పలాయనం చిత్తగించడంతో భారతసైన్యాలు తరిమి తరమి కొట్టాయి. ధృడసంకల్పుడైన ప్రధాని శాస్త్రిగారు అందించిన అండదండలతో మన వీరజవాన్లు లాహోర్,

సియాల్‌కోటలలో విజృంభించి పాకిస్తాన్ భూభాగాలలోనికి కూడ దూసుకుపోయి వారి గుండెలు బేజారెత్తించారు. దానితో పాకిస్తాన్ దేశ రాజధానిని రావల్పిండి నుంచి ఇస్లామాబాద్‌కు మార్చుకోవలసిన గతి పట్టింది.


## తాష్కెంటు సమావేశం

భారతదేశం, పాకిస్తాన్ దేశం మధ్య విరోధాన్ని విరమింప జేసే రాజీ ప్రక్రియకు శాంతియుత పరిష్కారమే మార్గమని రష్యా ప్రధాని అలెక్సి ఎస్. కోసిగిన్ నిష్కల్మషహృదయంతో ప్రయత్నం చేశారు. పాకిస్తాన్ ప్రసిడెంటు అయూబ్‌ఖాన్‌ను, భారతప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిని ఇరుదేశాల మధ్య శాంతిసాధనకు తన ఆహ్వానాన్ని అంగీకరించి తాష్కెంట్ రమ్మని కోరినారు.

భారతదేశం ఎప్పుడూ శాంతినే కోరుతుంది కాబట్టి అందుకు శాస్త్రిగారు ఆమోదం తెలిపారు. తాష్కెంటు సమావేశంలో మంచి జరుగుతుందని, తనకా నమ్మకముందని భారతదేశ ప్రజలకు తన ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరచి 1966 జనవరి 3వ తేదీన 14 మంది సభ్యులు గల ప్రతినిధివర్గంతో తాష్కెంటు బయలుదేరి వెళ్ళారు. ఆ ప్రతినిధి వర్గంలో రక్షణ మంత్రి యశ్వంతరావ్ చవాన్, విదేశాంగ మంత్రి స్వరణ్‌సింగ్, రక్షణ విదేశమంత్రిత్వ శాఖాధికారులు, ఇతరులు ఉన్నారు.

ది. 4-1-1966 న ఉదయం 11-05 గంటలకు సోవియట్ యూనియన్ ఆధ్వర్యాన భారత పాకిస్తాన్ అధినేతల శిఖరాగ్ర చర్చలు రష్యా ప్రధాని కోసిగిన్ స్వాగతవచనాలతో ప్రారంభమయ్యాయి. ఆ





సమావేశంలో ఇండియా విదేశాంగమంత్రి స్వరణ్‌సింగ్, రక్షణ మంత్రిచవాన్, యల్.కె.సియస్....రష్యాభారత రాయబారి టి. త్రిలోక్‌నాథకౌర్‌లె ఉన్నారు.

పాకిస్తాన్ వైపున విదేశాంగమంత్రి భుట్టో, వాణిజ్యమంత్రి గులామ్ ఫరూఖ్, విదేశాంగశాఖ ప్రధానకార్యదర్శి అజీజ్ అహ్మద్ వున్నారు.

సోవియట్ యూనియన్ వైపున విదేశాంగమంత్రి ఆండ్రీ గ్రొమికో, రక్షణమంత్రి మార్షల్ మాలిన్‌వెస్కి, రష్యావిదేశాంగ శాఖ కార్యలయంలో ఆగ్నేయాసియా విభాగం అధిపతి విఖచెవ్ వున్నారు.

అందరూ ఒకరికొకరు కరచాలనాలు చేసుకుంటూ స్నేహ వాతావరణంలో 8 రోజులు పాటు సంభాషణలు జరిగాయి. వాటి సారాంశమేమిటంటే

భారతప్రధాని, పాకిస్తాన్ అధ్యక్షుడు తమ తమ దేశాల సమస్త సాయుధ సిబ్బందిని 1966 ఫిబ్రవరి 25లోగా 1965 ఆగష్టు 5వ తేదీ ముందర తమ చేతుల్లో వుండిన స్థానాలకు ఉపసంహరింపబడాలనీ, ఉభయ పక్షాలు యుద్ధవిరమణ షరతులు అమలు పర్చాలని అంగీకరించారు. మిగతా విషయాలన్నీ శాంతియుతంగా పరిష్కరించుకోవాలి, బలప్రయోగానికి ఎవ్వరూ దిగకూడదు. తమ తమ దేశాల మధ్య మామూలు, శాంతియుత సంబంధాలను పునరుద్ధరించడానికి, తమ తమ ప్రజల మధ్య అవగాహనకు, స్నేహసంబంధాలకు దోహదం చేయడానికి తమ స్థిరనిశ్చయాన్ని ప్రకటిస్తున్నారు. భారతదేశం, పాకిస్తాన్‌ల 60 కోట్లమంది (అప్పటి లెక్కల ప్రకారం) ప్రజల సంక్షేమం కోసం ఈ ఆదర్శాలను సాధించడం ముఖ్యావసరమని వారు భావిస్తున్నారు.





లాల్ బహదూర్‌శాస్త్రి, అయూబ్‌ఖాన్ కూడ సంతృప్తిని వ్యక్తం చేస్తూ అందరి కరతాళధ్వనుల మధ్య ప్రకటనపై సంతకాలు చేశారు. దీనినే “తాష్కెంట్ ఒప్పందం” అంటారు.

దీనిని “తాష్కెంట్ ఒప్పందం” అంటారు.

భారత్, పాకిస్తాన్, రష్యా మూడుదేశాలు కూడ పరస్పరం సహకారం అందించుకోవాలని, సత్సంబంధాలు కలిగి యుండాలని శాంతిని వర్ధిల్లజేయాలని ఆకాంక్షిస్తూ మైత్రీభావాన్ని ముగ్గురు నాయకులూ వెల్లడించుకున్నారు. శాస్త్రీగారు, అయూబ్‌ఖాన్ గారు కూడ కోసిగిన్ గారికి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

భారత్, పాక్ నాయకుల అంగీకారప్రకటనలకు సాక్షిగా ఉండడానికి రష్యావారు సోవియట్ మంత్రిమండలి అధ్యక్షుని ఆహ్వానించారు.

ది. 10-11-1966 తేదీ రాత్రి 9 గంటలకు కోసిగిన్ భారతప్రధానమంత్రి, పాకిస్తాన్ ప్రసిడెంటుల గౌరవార్థం చక్కని విందు ఏర్పాటు చేశారు. ఆ విందుకు హాజరైనప్పుడు శాస్త్రిగారు ఏ విధమైన అలసట, అనారోగ్యం లేకుండా ఉల్లాసంగా ఉన్నారు. ఆయన కోసిగిన్‌తో, అయూబ్‌ఖాన్‌తో హాస్యవచనాలతో ఛలోక్తులు విసురుతూ ఎంతో ఉత్సాహంగా వున్నారు. ఉజ్బెక్‌స్థాన్ నృత్యం, సంగీతం చూస్తూ వింటూ గంటకు పైగా అక్కడే ఆనందంగా గడిపారు. విందు అయిన తర్వాత ఒకరి కొకరు అభినందనలు తెలుపుకుంటూ వీడ్కోలు వచనాలు చెప్పుకుంటూ ఎవరి బసకు వారు చేరుకున్నారు. ఆయనకు రాత్రి పడుకునేముందు ప్లాస్కులోని పాలు ఒక గ్లాసుడు తీసుకోవడం అలవాటు. పడుకోబోయేముందు రాత్రి 11 గం - 30 ని॥లకు రేడియో టెలిఫోన్‌లో మాట్లాడుతూ లలితాదేవితో రేపు ఉదయమే ఢిల్లీకి వస్తానని






చెప్పారు. అంతకు ముందే ఆయన గుల్జారీలాల్ నందాతో (హోంశాఖమంత్రి) తాష్కెంట్ ప్రకటనలోని కొన్ని అంశాలను గురించి మాట్లాడారు. అప్పుడు ఆయనతో నందా "మీరు యుద్ధనాయకులుగానే కాక శాంతినాయకులుగా కూడ నిరూపించుకున్నారు" అని ప్రశంసించారు.

తర్వాత ఆయన నిద్రపోయారు. కాని స్థానిక కాలమానం ప్రకారం 11 వ తేదీన ఉదయం 1-20 గంటలకు (1-20 ఎ.యమ్) శాస్త్రిగారికి దగ్గులాంటి గగుర్పాటు వచ్చింది. వెంటనే ప్రక్కగదిలో ఉన్న స్వంత వైద్యుడు డాక్టర్ చాగ్ దగ్గరకు వెళ్ళారు. ఆయన వెంటనే వైద్యం చేసినా ఫలించలేదు. ఆయన ప్రాణం అనంతవాయువులో కలిసిపోయింది. ఈ వార్త తెలిసిన వెంటనే కొద్ది నిమిషాలలో 10 మంది డాక్టర్లు వచ్చారు. వారు వైద్యంలో ఆరితేరినవారు నోటిద్వారా గాలిని ఎక్కించడానికి ప్రయత్నించారు. లాభంలేకపోయింది.

రష్యా స్థానిక కాలమానం ప్రకారం 1గం. 32 ని॥లకు లాల్‌బహుదూర్ శాస్త్రి దివంగతులయ్యారు. ఈ విషయం తెలియగానే కోసిగిన్ అక్కడకు వచ్చి, ఆ దృశ్యాన్ని చూచి చలించిపోయారు. రష్యా రక్షణమంత్రి మార్షల్ మాలన్ విస్కీ, విదేశాంగమంత్రి గ్రోమికో కూడ వచ్చి, కోసగిన్ సహా అందరు తలవంచుకొని కొంతసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు. అందరు శిరస్సులు వంచి లాల్‌బపదూర్‌శాస్త్రిగారి మృతదేహానికి జోహారులర్పించారు.

భారతీయ విలేఖరులతో కోసిగిన్ ఏమన్నారంటే "శాస్త్రిగారు మనతరంలో మహాపురుషుడు. శాంతిసాధనలో ఆయన కృషి అద్వితీయం. పాకిస్తాన్ కొఱకే కాదు, రష్యా కొఱకే కాదు ఆయన

శాంతి కొఱకు, సత్సంబంధాలతో మైత్రికొఱకు నిష్కల్మషహృదయంతో కృషిచేశారు ఆయన వాంఛితం నెరవేరుతుందని, శాంతినెలకొంటుందని ఆయన నాతో చెప్పారు. ఆయన మాటలను నేనెప్పటికీ మరిపోలేను".

శాస్త్రిగారి నిర్యాణవార్త తాష్కెంట్‌నుంచి రేడియో టెలిఫోన్‌లో న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి అధికార భవనానికి తెలియజేసినప్పుడు ఆయన కుటుంబసభ్యులంతా దిగ్భ్రమతో నిశ్చేష్టులైపోయారు. ఆ వార్త విన్న వెంటనే లలితాదేవి మాటలేకుండా పడిపోయారు. ఆయన తల్లి 95 ఏళ్ళ వయసులో నున్న రామదులారీదేవి ఆ వార్తను నమ్మలేక పోయింది. శాస్త్రిగారికి ఘనస్వాగతం పలుకుదామని ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రధానమంత్రి నివాసంలో ఉన్న సిబ్బంది అశని పాతంలాంటి వార్త విని కుప్పగా కూలిపోయారు.

శాంతి సౌమనస్యాలకు ఆటపట్టు; యుద్ధకుశలత రాజనీతిజ్ఞతకు సాటిలేని ధీశాలి, చారిత్రాత్మక సంఘటనలో అసువులు బాసిన అమరజీవి. అటువంటి లాల్ బహదూర్ శాస్త్రిగారి జీవితగాథ స్వతంత్ర భారతదేశ మహోజ్వల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన దివ్యాధ్యాయము. శాస్త్రిగారి నిర్యాణమునకు యావత్ప్రపంచము అశ్రువులువిడిచింది, ప్రగాఢసంతాపాన్ని వ్యక్తం చేసి నివాళులర్పించింది.

ఇండియాలో గుల్జారీలాల్‌నందా తాత్కాలిక ప్రధానమంత్రి అయ్యారు. తాష్కెంట్‌లో జరిగిన ప్రకటనలోని నిర్ణయాలకు కట్టుబడి ఉండి వాటిని పాటిస్తామని ప్రకటించారు.

మనదేశ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ స్వర్గీయలాల్‌బహదూర్ శాస్త్రి గారికి జోహారులర్పించారు. రేడియోలో లాల్‌బహదూర్ శాస్త్రి





దృఢసంకల్పంగల జాతీయవాది అని చెప్పారు. యావద్భారతజాతి నేడు దుఃఖసాగరంలో మునిగి ఉన్నారు' ఆయన ప్రజాబంధువు. దేశాభ్యుదయానికి, ప్రజాసంక్షేమానికి ఆయన తుది శ్వాస విడిచేవరకు నిర్విరామకృషిసల్పిన మహనీయవ్యక్తిగా మన అందరి స్మృతిపథంలో నిలచిపోగలరని ప్రశంసించారు.

"తాష్కెంటులో ఆయన జరిపిన చర్చలు పాకిస్తాన్, భారత దేశాలమధ్య శాంతి సామరస్యాలకు దోహదం చేస్తాయని నేను విశ్వసిస్తున్నాను. బలప్రయోగాల వల్ల విజయం సాధించినా వైరుధ్యం, శతృత్వం శాశ్వతంగా నిలిచిపోతాయి. చర్చల ద్వారా సామరస్యం సాధిస్తే రెండు దేశాలకు స్నేహ సంబంధాలు పెరిగి శాంతి నెలకొంటుంది".

"భారతదేశంలో అత్యున్నతమైన బిరుదు ఆయనకు ప్రదానం చెయ్యాలని ఎప్పటినుంచో అనుకొంటూ ఒకటి రెండుసార్లు ఆయనతో కూడ ప్రస్తావించాను. రాబోయే రిపబ్లిక్ దినోత్సవం నాడు ఆయనకు ప్రదానం చెయ్యాలని నిర్ణయం జరిగింది. కాని ఆయనకు "భారత రత్న" బిరుదు ఆయన అస్తమించిన తర్వాత విషాదహృదయంతో ప్రదానం చేస్తున్నాను" అని శాంతివచనాలతో ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షిస్తూ పవిత్రమైన శ్లోకాలను పటించారు.

## అంత్యక్రియలు

రష్యాలో పదిలక్షలమంది పౌరులు లాల్‌బహదూర్ శాస్త్రిగారి భౌతిక కాయానికి వీడ్కోలు పలికారు. తాష్కెంటు నుంచి ఢిల్లీలో పాలం విమానాశ్రయానికి 11 వ తేదీ మధ్యాహ్నానికి 2 గం 31 ని॥కు సోవియట్ విమానంలో తీసుకువచ్చారు. ఢిల్లీలో లక్షలాది మంది ప్రజలు






అశ్రుపూరిత నయనాలతో శ్రద్ధాంజలి సమర్పించారు. పాలం విమానాశ్రయం నుంచి శాస్త్రి గారి నివాసగృహంవరకు 12 మైళ్ళ మార్గంలో జనం కిటికిటలాడుతూ ప్రజావాహని ఆయనకు బాష్పాంజలి ఘటించారు. ఆయన భౌతికకాయం ఇంటికి రాగానే లలితాదేవి ఎదురుగా వెళ్ళి దుఃఖం పొంగిపొర్లుతూ ఉండగా ఆయన పాదాలను, ముఖాన్ని స్పృసించి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ సోకసముద్రంలో మునిగిపోయింది. ఆయన తల్లి వృద్ధాప్యంలో చలించిపోతూ చెక్కిళ్ళ నిండా నీటిధారలతో విలపించసాగింది.

త్రివర్ణ జాతీయ పతాకాలతో శాస్త్రిగారి భౌతిక కాయాన్ని కప్పి ప్రజలు దర్శించడానికి వీలుగా వేదికపైన ఉంచారు. ఆయన భార్య, పుత్రులు, తల్లి, బంధువులు ప్రక్కన కూర్చొని ఉండగా రాత్రంతా రామధున్ గీతాలాపాన జరిగింది. ది. 12-1-1966 తేదీ మధ్యాహ్నం 12 గం 32 ని॥లకు భారతజాతి ప్రియతమ నాయకుడు స్వర్గీయ లాల్‌బహదూర్ శాస్త్రిగారి భౌతిక కాయానికి యమునా నదీ తీరాన నెహ్రూగారి సమాధి అయిన శాంతి వనానికి సమీపంలోనే సకల సైనిక మర్యాదలలతో దహన సంస్కారాలు జరుపుతుంటే ప్రజలు "శాస్త్రిజీ అమర్ రహే" అన్న నినాదాలు ఆకాశంలో ప్రతిధ్వనింపజేశాయి.

అంత్యక్రియలకు రాష్ట్రపతి రాధాకృష్ణన్, ఉపరాష్ట్రపతి జాకీర్ హుస్సేన్, తాత్కాలిక ప్రధాని గుల్జారీలాల్‌నందా మొదలగు ప్రముఖులంతా హాజరయ్యారు. అంతేకాకుండా సోవియట్ ప్రధాని కోసిగిన్, అమెరికా ఉపాధ్యక్షులు హ్యూబర్ట్ హంఫ్రీ, అమెరికా విదేశాంగమంత్రి డీన్ రస్క్, లండన్ నుంచి మౌంట్ బాటన్, జార్జిబ్రౌన్,

ఎడ్వర్డ్ హీత్, ఐక్యఅరబ్ రిపబ్లిక్ ఉపాధ్యక్షులు హుసేన్ ఎకషఫీ, యుగోస్లావియా ఉపాధ్యక్షులు జకోవ్ బ్లజవిక్, పాకిస్తాన్ వాణిజ్యమంత్రి గులాంఫరూక్, ఆఫ్ఘనిస్తాన్ ప్రధాని మైనద్వాల్, నేపాల్ మంత్రి మండలి అధ్యక్షులు శ్రీ సూర్యబహదూర్‌ధాపా మెదలైనవారు పాల్గొన్నారు. చైనా దౌత్య ప్రతినిధికూడా హాజరయ్యారు. ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి తరపున శ్రీ సి.వి.నరసింహన్ హాజరయ్యారు.

ఫ్రాన్సు, జపాన్, బర్మా, థాయిలెండ్, సింగపూర్, లావోస్, కెన్యా, పశ్చిమజర్మనీ దేశాలు కూడా కొందరు విదేశాంగ మంత్రులు, కొందరు ప్రత్యేక ప్రతినిధులను శాస్త్రిగారి అంత్యక్రియలకు హాజరుకావడానికి పంపించారు. అనేక దేశాలు తమ రాయబారులను అంత్యక్రియలకు హాజరు కావడానికి రేడియో టెలిఫోన్ ద్వారా ఆదేశాలు అందజేశారు. సిక్కింమహారాజా, భూటాన్ ప్రభుత్వాధికారులు, దలైలామా మెదలైనవారు కూడా హాజరాయ్యారు.

రాష్ట్రపతి అధ్యక్షతన ఆరోజుసాయంత్రం రామ్‌లీలా మైదానంలో జరిగిన సంస్మరణ సభలో సోవియట్ ప్రధాని కోసిగిన్‌తో సహా వివిధ దేశాలనుంచి వచ్చిన ప్రతినిధులు శాస్త్రిగారి ఆకస్మిక అస్తమయానికి తమ ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చి స్మృత్యంజలి ఘటించారు. మహోత్కృష్టమైన లక్ష్యాలసాధనకు అకుంఠిత దీక్షతో, అవిశ్రాంతంగా కృషి చేసిన శాంతి కాముకుడైన మహాయోధుడని, రాజనీతిజ్ఞుడని ప్రశంసించారు.

ఒకసారి లిప్టన్ టీ కంపెనీ వారు లాల్‌బహదూర్ శాస్త్రిని (అప్పుడు అలహాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా ఉన్న రోజుల్లో) సన్మానించడానికి ఒక సమావేశం ఏర్పాటు చేసి ఆయనను ఆహ్వానించారు.





లాల్‌బహదూర్ శాస్త్రి భౌతికకాయం వద్ద ఇందిరాగాంధి

ఆయనను వచ్చి వి.ఐ.పి. లకోసం (ఆఫీసర్ల కోసం) ఏర్పాటు చేసిన కుర్చీలలో కూర్చోకుండా వెళ్ళి కార్మికుల కోసం ఏర్పాటు చేసిన తివాచీ మీద కార్మికుల ప్రక్కన కూర్చున్నారట." నేను కూర్చోవలసింది ప్రజలమధ్య! ప్రతిరోజూ వాళ్ళకు దూరంగా ఎక్కడో కూర్చుంటూ ఉంటాను. కనీసం ఇప్పుడేనా నాకీ అవకాశాన్ని కల్పించండి" అని అనడంతో కుర్చీలమీద కూర్చున్న వాళ్ళంతా దిగివచ్చి ఆయనతోపాటు క్రిందనే కూర్చొని ఆయన ఉపన్యాసం విన్నారట.

శాస్త్రిగారు ఇంట్లో పిల్లల్ని కూడా ఎప్పుడు కొప్పడేవారు కారు. వారెప్పుడైనా తప్పుచేస్తే వారికి పరుషంగా "ఇలా చెయ్యకూడదు" "అలా చెయ్యాలి" అని నిర్బంధవిధానంగా కాకుండా ఎంతో ప్రేమతో మాటల్లో మరపించి అసలు విషయం చెప్పి వెళ్ళేవారు. వారు వెళ్ళిన తర్వాత ఆ పిల్లలకు ఆయన చెప్పిన విషయం ఆగా అర్థం అయ్యేది. దానితో వారు సక్రమమైన పద్ధతిలో నడుచుకొనేవారు. ఆయన ఓర్పు నేర్పులతో ఎదుటివారిని ఆకట్టుకునేవారు. అదే ఆయనలోని ప్రజ్ఞ, ప్రత్యేకత.

ఆయన ఇంకా కొంతకాలం బ్రతికి ఉండి భారతదేశ ప్రధానమంత్రి పదవిని కొనసాగించితే భారతదేశం భూతలస్వర్గం అయ్యేది. ఆ పురుషోత్తమునకు మన హృదయపూర్వక మనస్సుమాంజలి ఘటించడం కంటె మనమింకేమి చెయ్యగలం! ఆయన సుగుణాలను మనం ఆచరించడమే కావలసింది. అదే ఆయనకు మనమిచ్చే నివాళి.